# గిరిజన వికాసానికి 'రాహుల్' బాట..





వాస్తవాలు పలుకు DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక






హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 48 | 30-06-2026 మంగళవారం | పేజీలు: 08 | వెల: 3/-


# డూప్లికేట్ ఓట్లపై విచారణ జరపాలి

దేశంలో ఇప్పటికే ఎనిమిది సార్లు ప్రత్యేక సమగ్ర సవరణ
బోధన్‌లో ఏడాదిలో 7 వేల ఓట్లు తొలగించారని ఆరోపణ
ఈసీ వెంటనే వివరణ ఇవ్వాలని డిమాండ్
ప్రకాశ్‌రాజ్ డూప్లికేట్ ఓటు తొలగింపునకు ఏడేళ్లు పట్టిందని వ్యాఖ్య
కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు గుర్తించినట్లు వెల్లడి
రాష్ట్రవ్యాప్తంగా నకిలీ ఓట్లు అధికంగా ఉన్నాయని ఆరోపణ
రేవంత్ గెలుపుపై అనుమానాలు వ్యక్తం చేసిన కవిత
రాష్ట్రాల మధ్య ఓటరు డేటాను పరిశీలించాలని సూచన
ఒక వ్యక్తికి ఒకేచోట మాత్రమే ఓటు ఉండేలా చర్యలు కోరిన బీఆర్ఎస్ నేత
ఎన్నికల సంఘానికి అధికారికంగా ఫిర్యాదు చేస్తామని ప్రకటన



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) నిర్వహించినప్పటికీ ఓటర్ల జాబితాల్లో లోపాలు కొనసాగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్‌లో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆమె, రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు, ఓట్ల తొలగింపులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ఎన్నికల సంఘం ప్రజలకు మిగతా 2లో..

# భారత్, సీషెల్స్ సరికొత్త రికార్డు

యూపీఐ, స్పేస్, రక్షణ సహా 19 కీలక ఒప్పందాలపై సంతకాలు
ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక పర్యటన విజయవంతం
భారత్, సీషెల్స్ ద్వైపాక్షిక బంధంలో సరికొత్త అధ్యాయం
సీషెల్స్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి భేటీ
50 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా స్మారక చిహ్నం విడుదల
భారత్ నుంచి సముద్ర రక్షణ రంగానికి భారీ కానుక
సీషెల్స్ ప్రభుత్వానికి ఫాస్ట్ పెట్రోల్ వెసెల్ బహుమతి
ఇక సీషెల్స్‌లోనూ మన 'యూపీఐ' డిజిటల్ చెల్లింపులు..

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
భారతదేశం, హిందూ మహాసముద్ర ప్రాంతంలోని కీలక ద్వీప దేశమైన సీషెల్స్ మధ్య దౌత్య, వ్యూహాత్మక సంబంధాలు సరికొత్త ఎత్తుకు చేరాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన సీషెల్స్ పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటనలో భాగంగా యూపీఐ డిజిటల్ చెల్లింపులు, ఆరోగ్యం, వ్యవసాయం, షిప్పింగ్, అంతరిక్ష రంగం వంటి ఎన్నో కీలక రంగాలలో రెండు దేశాల మధ్య ఏకంగా 19 చారిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయని ప్రధాని మోదీ స్వయంగా వెల్లడించారు. వాతావరణ పరిరక్షణ, గ్రీన్ హైడ్రోజన్, ఇంధన భద్రత, బ్లూ ఎకానమీ (సముద్ర వనరుల అభివృద్ధి) వంటి వినూత్న రంగాలలో ఇరుదేశాలు పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నాయని, సీషెల్స్ సర్వతోముఖాభివృద్ధికి భారత్ ఎల్లప్పుడూ ఒక నమ్మకమైన మిత్రుడిగా అండగా ఉంటుందని ప్రధాని తన 'ఎక్స్' సామాజిక మాధ్యమం మిగతా 2లో..



# జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదు

బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్
జీవితం ఓపికకు పరీక్ష
యువత ఆతృత తగ్గించుకోవాలి
వేగం కంటే నిలకడ ముఖ్యం
నిబద్ధతే విజయానికి బలం
చిన్న వయసులోనే రాజకీయ ప్రవేశం
సవాళ్లను అధిగమిస్తూ ముందుకు
ప్రతి పనిలో ప్రత్యేకత ఉండాలి
బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి
ఓపికతోనే విజయం సాధ్యం
విద్యార్థులకు నితిన్ నబీన్ సూచనలు




# శిల్పకళా వేదికలో రాష్ట్రస్థాయి
# రైతు భరోసా సదస్సు

వర్షాల కారణంగా మధిర సభను రద్దు చేసిన ప్రభుత్వం
హైదరాబాద్‌లో రైతు భరోసా పంపిణీకి నిర్ణయం
సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో శిల్పకళా వేదిక ఎంపిక
30వ తేదీ సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం
రాష్ట్రవ్యాప్తంగా రైతులు, రైతు వేదికల ప్రతినిధుల హాజరు
రైతులకు పెట్టుబడి సాయం అందజేయనున్న ప్రభుత్వం
సదస్సు విజయవంతం చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు
అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచన
రాష్ట్రస్థాయిలో రైతులతో ప్రభుత్వం ముఖాముఖి
వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని సందేశం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పథకం నిధుల పంపిణీ కోసం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4 గంటలకు శిల్పకళా వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, రైతు వేదికల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.
వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రైతు ఆశీర్వాద సభగా నిర్వహించాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. అయితే ఇటీవల రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆ సభను రద్దు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికకు మార్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు సులభంగా పాల్గొనేలా, కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
సదస్సులో రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయడంతో పాటు, ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి వివరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా కూడా పెద్ద సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు.
కార్యక్రమానికి వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, భద్రత, తాగునీరు, పార్కింగ్, ఇతర మౌలిక మిగతా 2లో..



# గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబాటు

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ వ్యాఖ్యలు
పెండింగ్ రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశం
పీఎం ఆవాస్ సర్వే త్వరితగతిన ముగించాలని సూచన
గ్రామీణాభివృద్ధి శాఖ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని స్పష్టం
నిధుల వాటా సకాలంలో విడుదల చేయాలని రాష్ట్రాలకు సూచన
గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది అని వ్యాఖ్య
రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని పిలుపు
వికసిత్ భారత్ గ్రామీణ యోజన జులై 1 నుంచి అమలు
గ్రామీణాభివృద్ధి అమలులో ఏపీ ముందంజలో ఉందని ప్రశంస
తిరుపతిలో జులై 2న జాతీయ కార్యక్రమానికి శ్రీకారం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు. గ్రామీణ రహదారులు, గృహ నిర్మాణ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయాలని మిగతా 2లో..

# అసెంబ్లీ రద్దు ఎందుకు..?

హరీష్‌రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది..
అసెంబ్లీ రద్దు డిమాండ్‌పై హరీష్‌రావుకు కౌంటర్
బీజేపీ-బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని వ్యాఖ్యలు
వారం రోజుల్లో రైతు భరోసా నిధుల హామీ
ఇందిరమ్మ ఇళ్ల కోసం 23 స్థలాలు గుర్తింపు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో అసెంబ్లీ రద్దుపై బీఆర్ఎస్ నేత హరీష్‌రావు విసిరిన సవాళ్లకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించేందుకు పూర్తి మెజారిటీతో అధికారాన్ని ఇచ్చారని, అలాంటప్పుడు దేనికోసం అసెంబ్లీని రద్దు చేయాలని ఆయన ప్రశ్నించారు. హరీష్ రావుకు పూర్తిగా మెంటల్ బ్యాలెన్స్ తప్పడం వల్లే ఇలాంటి అర్థరహితమైన సవాళ్లు విసురుతున్నారని మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మిగతా 2లో..

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించాలి

రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే నిబంధనలను సవరించాలి
కేబినెట్ నిర్ణయం తరువాతే కొత్త చట్టంపై తుది నిర్ణయం
కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం
60:40 నిధుల విధానంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం
అటవీ అనుమతులతో అభివృద్ధి పనులకు బ్రేక్
జాతీయ అవార్డులతో తెలంగాణ పనితీరుకు గుర్తింపు
ఉన్నతస్థాయి సమావేశంలో తేల్చిచెప్పిన మంత్రి సీతక్క



## శిల్పకళా వేదికలో రాష్ట్రస్థాయి రైతు భరోసా సదస్సు

మొదటిపేజీ తరువాయి

వసతులు కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.
రైతు భరోసా పథకం ద్వారా వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి సాయం సకాలంలో రైతులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందనే సందేశాన్ని ఈ రాష్ట్రస్థాయి సదస్సు ద్వారా ప్రజలకు చేరవేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## డూప్లికేట్ ఓట్లపై విచారణ జరపాలి

మొదటిపేజీ తరువాయి

స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోధన్ నియోజకవర్గంలో కేవలం ఏడాది వ్యవధిలోనే సుమారు 7 వేల ఓట్లు తొలగించారని కవిత ఆరోపించారు. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు ఎలా తొలగించారో ఎన్నికల సంఘం వివరించాలని కోరారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓటు నమోదై ఉండగా, వాటిలో ఒకదాన్ని తొలగించేందుకు ఎన్నికల సంఘానికి ఏడు సంవత్సరాలు పట్టిందని కవిత ప్రస్తావించారు. ఈ ఉదాహరణే ఓటర్ల జాబితాల నిర్వహణలో ఉన్న లోపాలను బయటపెడుతోందని వ్యాఖ్యానించారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించినట్లు అధికారికంగా చెబుతున్నప్పటికీ, తమ బృందం నిర్వహించిన పరిశీలనలో అక్కడ 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని కవిత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి డూప్లికేట్ ఓట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని ఆరోపించారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి సుమారు 32 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారని గుర్తు చేసిన ఆమె, ఈ డూప్లికేట్ ఓట్ల వల్లే ఆ విజయం సాధ్యమైందేమో అన్న అనుమానం తమకు ఉందన్నారు. కర్ణాటక నుంచి నోట్ల బదిలీతో పాటు ఓట్ల బదిలీ కూడా జరిగిందా అనే సందేహం వ్యక్తం చేశారు.
ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఓటర్ల డేటాను ఎన్నికల సంఘం సమగ్రంగా పరిశీలించాలని కవిత సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఓటు ఉన్న కొందరికి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓటు నమోదై ఉందని పేర్కొంటూ, ఒక వ్యక్తికి ఒకేచోట మాత్రమే ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటర్‌స్టేట్ డూప్లికేట్ ఓట్లను పూర్తిగా తొలగించి ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించాలని ఆమె అన్నారు. ఈ అంశాలన్నింటిపై ఎన్నికల సంఘానికి అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు కవిత వెల్లడించారు.

## జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదు

- **బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్**
- **జీవితం ఓపికకు పరీక్ష**
- **యువత ఆతృత తగ్గించుకోవాలి**
- **వేగం కంటే నిలకడ ముఖ్యం**
- **నిబద్ధతే విజయానికి బలం**
- **చిన్న వయసులోనే రాజకీయ ప్రవేశం**
- **సవాళ్లను అధిగమిస్తూ ముందుకు**
- **ప్రతి పనిలో ప్రత్యేకత ఉండాలి**
- **బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి**
- **ఓపికతోనే విజయం సాధ్యం**
- **విద్యార్థులకు నితిన్ నబీన్ సూచనలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని, అది మన ఓపికకు పెట్టే పరీక్ష అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించాలంటే వేగం కంటే ఓపిక, నిలకడ, నిబద్ధత ఎంతో ముఖ్యమని చెప్పారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని వీబీఐటీ క్యాంపస్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్'లో ఆయన పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు.
ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. రాజకీయ జీవితంలో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి ప్రశ్నించగా, చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చానని నితిన్ నబీన్ తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలి రోజుల్లో తన భవిష్యత్తుపై కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే ప్రతి పనిలో తనదైన ముద్ర వేయాలనే లక్ష్యంతో ముందుకు సాగానని చెప్పారు.
తనకు పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో, చిత్తశుద్ధితో పూర్తి చేయడమే తన విజయానికి కారణమని పేర్కొన్నారు. నేటి యువత త్వరగా లక్ష్యాలను చేరుకోవాలనే ఆరాటంలో ఉంటోందని, కానీ జీవితంలో గొప్ప విజయాలు ఒక్కరోజులో రావని అన్నారు. ఏ పని చేసినా ఓపిక, క్రమశిక్షణ, నిలకడ, పూర్తి శక్తితో చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు.
విజయం కోసం షార్ట్‌కట్‌లను వెతకకుండా నిరంతరం శ్రమించాలన్నారు. అపజయాలు ఎదురైనా నిరాశ చెందకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. జీవితంలో సహనం, అంకితభావం, కష్టపడే తత్వం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని నితిన్ నబీన్ అన్నారు.

## భారత్, సీషెల్స్ సరికొత్త రికార్డు

మొదటిపేజీ తరువాయి

ద్వారా స్పష్టం చేశారు.
పర్యటనలో భాగంగా ఆదివారం నాడు మాహే ద్వీపంలోని అధికారిక 'స్టేట్ హౌస్' వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినిల మధ్య అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉన్నత స్థాయి ద్వైపాక్షిక భేటీ జరిగింది. ఈ సమావేశంలో ఇరు దేశాధినేతలు ప్రాంతీయ రక్షణ, ఆర్థిక ప్రగతిపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో భారతదేశం ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద సీషెల్స్‌లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతి పట్ల ఇరువురు నేతలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదే సమయంలో భారత్‌సీషెల్స్ మధ్య స్నేహపూర్వక దౌత్య సంబంధాలు ఏర్పడి 50 సంవత్సరాలు (గోల్డెన్ జూబ్లీ) పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, దానికి గుర్తుగా ఒక ఉమ్మడి ప్రత్యేక స్మారక చిహ్నాన్ని ఇద్దరు నేతలు కలిసి ఆవిష్కరించారు.
హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా సీషెల్స్ రక్షణ దళాలకు భారత ప్రభుత్వం తరపున ప్రధాని మోదీ భారీ కానుకలను అందజేశారు. సీషెల్స్ కోస్ట్ గార్డ్ కోసం ఒక అత్యాధునిక 'ఫాస్ట్ పెట్రోల్ వెసెల్' (యుద్ధ నౌక)ను ప్రధాని మోదీ బహుమతిగా సమర్పించారు. దీనితో పాటు సీషెల్స్ రక్షణ దళాల వినియోగం కోసం మరో 10 ప్రత్యేక యుటిలిటీ వాహనాలు, 5 సెట్ల లేజర్ రేడియల్ క్లాస్ పడవలు మరియు అత్యవసర వైద్య సేవల కోసం 6 అత్యాధునిక అంబులెన్సులను అందజేయనున్నట్లు మోదీ హామీ ఇచ్చారు. అలాగే ఆ దేశ ఆహార, మౌలిక సదుపాయాల అవసరాల కోసం 500 మెట్రిక్ టన్నుల నాణ్యమైన బియ్యం, 8,500 మెట్రిక్ టన్నుల సిమెంట్‌ను ఉచితంగా సహాయం కింద అందిస్తామని భారత్ ప్రకటించింది.ఇరు దేశాల మధ్య కుదిరిన 19 అవగాహన ఒప్పందాల అనంతరం, సీషెల్స్ దేశంలో వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 1,250 కోట్ల విలువైన ఆర్థిక సాయం పత్రాలను ఇరు దేశాలు పరస్పరం మార్చుకున్నాయి. ఇందులో అత్యంత ప్రాధాన్యత కలిగిన విషయమేమిటంటే.. భారత డిజిటల్ విప్లవానికి ప్రతీకగా నిలిచిన 'యూపీఐ' సేవలు ఇకపై సీషెల్స్ దేశంలోనూ అందుబాటులోకి రానున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ మరియు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ సీషెల్స్ మధ్య ఈ మేరకు ఒక చారిత్రక డీల్ కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా సీషెల్స్ వ్యాప్తంగా యూపీఐ డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాలను విస్తరించడానికి, ఇరు దేశాల మధ్య ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడానికి మార్గం సుగమమైంది.
వైద్య మరియు ఆరోగ్య రంగంలో భాగంగా భారతదేశంలో విజయవంతంగా నడుస్తున్న 'జనౌషధి' పథకాన్ని సీషెల్స్‌లోనూ వర్తింపజేయడానికి ఒప్పందం కుదిరింది. భారత ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, సీషెల్స్ ఆరోగ్య మంత్రిత్వ శాఖల మధ్య జరిగిన ఈ ఒప్పందం ద్వారా భారత్ నుండి అత్యంత తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులు, ఆధునిక వైద్య సామగ్రి ఆ దేశానికి ఎగుమతి కానున్నాయి. అలాగే వ్యవసాయ రంగంలో పరస్పర సాంకేతిక మార్పిడి కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సీషెల్స్ ప్రభుత్వంతో చేతులు కలిపింది. వీటితో పాటు అంతర్జాతీయ నేరాలను అరికట్టడానికి, ఇరు దేశాల నుండి ఆర్థిక లేదా ఇతర నేరాలు చేసి పరారీలో ఉన్న నేరగాళ్లను చట్టబద్ధంగా అప్పగించడానికి వీలుగా ఒక పటిష్టమైన 'అప్పగింతల ఒప్పందం' పై కూడా రెండు దేశాలు సంతకాలు చేశాయి. సీషెల్స్ దేశ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ (గోల్డెన్ జూబ్లీ) వేడుకలు ఆదివారం నాడు వైభవంగా జరిగాయి. ఈ చారిత్రక వేడుకలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య గౌరవ అతిథిగా హాజరయ్యారు. దీని ద్వారా సీషెల్స్ దేశ జాతీయ దినోత్సవ వేడుకలలో అధికారికంగా పాల్గొన్న మొట్టమొదటి భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ చారిత్రక ఘట్టంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. సీషెల్స్ జాతీయ స్వర్ణోత్సవ వేడుకలలో భాగస్వామి కావడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని, ఆ దేశ ప్రగతి ప్రస్థానంలో భారత్ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని ఆనందం వ్యక్తం చేశారు.
సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో సరిహద్దులు దాటిన భారత స్నేహ హస్తం స్పష్టంగా కనిపించింది. ఈ స్వర్ణోత్సవ కవాతులో భారత సైన్యానికి చెందిన ప్రతిష్టాత్మక 'అసోం రెజిమెంట్'తో పాటు భారత నావికాదళానికి (ఇండియన్ నేవీ) చెందిన సైనిక దళాలు ప్రత్యేకంగా పాల్గొని తమ శౌర్యాన్ని ప్రదర్శించాయి. అంతర్జాతీయ వేదికపై భారత సైనిక బృందం గంభీరంగా కవాతు చేస్తుండగా, గౌరవ అతిథి సీట్లో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ లేచి నిలబడి మన జవాన్లకు స్మార్ట్ సెల్యూట్ చేస్తూ గౌరవ వందనం సమర్పించారు. ఇరు దేశాల మధ్య ఉన్న శాశ్వత స్నేహ బంధానికి మరియు రక్షణ రంగ పరిణతికి ఈ ఉమ్మడి కవాతు ఒక నిలువెత్తు నిదర్శనమని ప్రధాని మోదీ కొనియాడారు. పర్యటన ముగించుకునే ముందు సోమవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ సీషెల్స్‌లో ప్రసిద్ధి గాంచిన హైందవ ఆధ్యాత్మిక కేంద్రం 'నవశక్తి వినాయగర్' ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలకగా, మోదీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరు దేశాల ప్రజల క్షేమం కోసం ప్రార్థించారు. ఆ తర్వాత సీషెల్స్ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో స్థానికంగా స్థిరపడిన ప్రవాస భారతీయులు (ఇండియన్ డయాస్పోరా) పెద్ద ఎత్తున పాల్గొని మోదీకి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ చారిత్రక పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ సోమవారం మధ్యాహ్నం తిరిగి భారతదేశానికి ప్రయాణమయ్యారు.

## గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబాటు

మొదటిపేజీ తరువాయి



రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.
న్యూఢిల్లీలో సోమవారం కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాల వారీగా పథకాల పురోగతిని సమీక్షించిన కేంద్ర మంత్రి తెలంగాణ అమలుపై పలు సూచనలు చేశారు.
ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద చేపట్టిన రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.
గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. తగిన సిబ్బంది లేకపోవడం వల్ల పథకాల అమలులో జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధికి గ్రామాల అభివృద్ధే పునాదిగా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో అన్ని రాష్ట్రాలు రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జులై 1 నుంచి 'వికసిత్ భారత్ గ్రామీణ యోజన' అమల్లోకి వస్తుందని వెల్లడించారు. కేంద్రరాష్ట్ర భాగస్వామ్య పథకాల నిధుల వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో విడుదల చేయాలని సూచించారు.
మరోవైపు, గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ పనితీరును కేంద్ర మంత్రి ప్రశంసించారు. వీబీజీఆర్ఎంఏజీఐకి సంబంధించిన నోటిఫికేషన్‌ను పూర్తి చేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచిందని తెలిపారు. జులై 2న తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయి ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసినట్లు శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రకటించారు. అలాగే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు స్థానం దక్కడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## అసెంబ్లీ రద్దు ఎందుకు.?

మొదటిపేజీ తరువాయి



సుదీర్ఘంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేక, ఉనికిని కాపాడుకునేందుకే ప్రతిపక్షాలు ఇలాంటి డ్రామాలు ఆడుతున్నాయని, ప్రతి ఎన్నికలోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన శిక్ష వేస్తున్నారని గుర్తుచేశారు.

**బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలు..**

**కేటీఆర్ విమర్శలపై రియాక్షన్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసే వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ.. కేటీఆర్ చేసే ప్రతి చిన్న విషయానికి తాను ప్రతిసారీ సమాధానం చెప్పనని, కానీ సమయం వచ్చినప్పుడు మాత్రం చాలా గట్టిగా బదులిస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఎవరిపైనా వ్యక్తిగత కక్షలతో వ్యవహరించబోదన్నారు. ఇదే సమయంలో బీజేపీ వైఖరిని ఎండగడుతూ.. రాష్ట్రంలో అధికారం సాధిస్తామంటున్న బీజేపీది కేవలం అత్యాశ మాత్రమేనని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేని ఆ పార్టీ, ఇక్కడ ప్రభుత్వం మారుస్తామని కలలు కంటోందని చమత్కరించారు. నిజానికి బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకే తాను ముక్కలని.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు, థర్మల్ పవర్ ప్లాంట్ల భారీ అక్రమాలపై తాము సీబీఐ విచారణ కోరినప్పటికీ కేంద్రంలోని బీజేపీ సర్కార్ స్పందించకపోవడమే అందుకు నిదర్శనమన్నారు.

**వారం రోజుల్లో రైతు భరోసా..**

**ఇందిరమ్మ ఇళ్లకు స్థలాల గుర్తింపు**

రాష్ట్ర రైతాంగానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన భరోసా ఇచ్చారు. సాంకేతిక కారణాల వల్ల ఒకటి రెండు రోజులు ఆలస్యమైనప్పటికీ.. రాబోయే వారం రోజుల్లోనే అర్హులైన రైతులందరి ఖాతాల్లోకి 'రైతు భరోసా' నిధులను పూర్తిగా జమ చేస్తామని స్పష్టం చేశారు. అలాగే, నిరుపేదల సొంతింటి కల వేగంగా నెరవేర్చేందుకు గానూ మొదటి విడతలో 18 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 23 అనువైన స్థలాలను ఇప్పటికే గుర్తించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొత్తగా ఎలాంటి రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని తేల్చిచెప్పారు. ఇటీవల సవరించిన భూముల ప్రభుత్వ విలువల (మార్కెట్ ధరల) నిర్ణయంలో ఎక్కడైనా వ్యత్యాసాలు లేదా పొరపాట్లు జరిగినట్లు తమ దృష్టికి వస్తే.. వాటిని పునఃపరిశీలించి తక్షణమే సవరిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించాలి

- **రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే నిబంధనలను సవరించాలి**
- **కేబినెట్ నిర్ణయం తరువాతే కొత్త చట్టంపై తుది నిర్ణయం**
- **కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం**
- **60:40 నిధుల విధానంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం**
- **అటవీ అనుమతులతో అభివృద్ధి పనులకు బ్రేక్**
- **జాతీయ అవార్డులతో తెలంగాణ పనితీరుకు గుర్తింపు**
- **ఉన్నతస్థాయి సమావేశంలో తేల్చిచెప్పిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు-2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**కొత్త 60:40 నిధుల విధానంపై తీవ్ర అభ్యంతరాలు.. పాత పద్ధతే ముద్దు**

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన 'VBGRMGS' పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు.

**అభివృద్ధికి బ్రేక్ వేస్తున్న అటవీ అనుమతులు**

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన పీఎం ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు.



**దేశంలోనే తెలంగాణ టాప్..**

**అవార్డులే నిదర్శనం**

ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు రావడం తమ ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా 100 రోజుల ఉపాధి కల్పనను అమలు చేయడంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తేనే గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని కేంద్రమంత్రికి వివరించారు.

# శాకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

- **బోధన్‌కు చేరుకున్న అహింసా ప్రపంచ యాత్ర**

**బోధన్, నిజామాబాద్ జూన్29(డీడీ9 వార్త):**

ప్రజలందరూ శాకాహారులుగా మారి, జంతువుల ప్రాణాలను కాపాడాలని కోరుతూ చేపట్టిన 'అహింసా ప్రపంచ యాత్ర' సోమవారం బోధన్ పట్టణానికి చేరుకుంది. ఈ యాత్ర ద్వారా సమాజంలో శాంతియుత జీవనాన్ని నెలకొల్పాలని ఆశిస్తున్నట్లు యాత్ర నిర్వాహకులు తెలిపారు. జంతువులను చంపడం మానేసినప్పుడే మనిషికి నిజమైన శాంతి, సుఖం లభిస్తాయని, మాంసాహారం మానవజాతికి ఒక పీడగా మారిందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 31న కర్నూలులోని బుద్ధా పిరమిడ్ వద్ద ప్రారంభమైన ఈ యాత్ర, 30 రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతూ బోధన్‌కు చేరుకుందని నిర్వాహకులు వివరించారు. ఆకులము, ఈకులము అనే తేడా లేకుండా అందరి శరీరాలు, కర్మలు ఒక్కటేనని, ఎవరి కర్మకు తగ్గ ఫలితం వారు అనుభవిస్తారని వారు పేర్కొన్నారు. పరోపకారార్థం ఇతరులకు మేలు చేసే పద్ధతిని అనుసరించాలని, అహింసా మార్గంలో నడవడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని



వారు పిలుపునిచ్చారు. ఈ యాత్ర ద్వారా ప్రజల్లో శాకాహారం పట్ల అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## బోధన్ నర్సింగ్ స్కూల్‌కు ప్రత్యేక భవనం, హాస్టల్ నిర్మించాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్

**బోధన్, నిజామాబాద్ జూన్29(డీడీ9 వార్త):**

బోధన్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సోమవారం నిజామాబాద్ జాయింట్ కలెక్టర్ భుజంగరావుకు వినతిపత్రం అందజేసింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో సరైన వసతులు లేని చిన్న గదుల్లో నర్సింగ్ స్కూల్ కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వర్షపు నీరు లీక్ అవుతూ విద్యార్థుల చదువుకు తీవ్ర అంతరాయం కలిగిస్తోందని, కనీస సౌకర్యాలు లేని ఒకే చిన్న గదిలో 17 మంది విద్యార్థినులు ఇబ్బందికరంగా ఉండాల్సి రావడం అమానవీయమని ఆయన పేర్కొన్నారు. మొత్తం 70 మంది విద్యార్థులకు సరిపడా వసతి లేక, సొంత స్టైఫండ్‌తోనే హాస్టల్ ఖర్చులను భరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి నర్సింగ్ స్కూల్‌కు ప్రత్యేక భవనం, ఆధునిక హాస్టల్ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. దీనితో పాటు బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్డియాలజీ, ఐసీయూ వంటి అత్యాధునిక విభాగాలను మరియు మేల్, ఫీమేల్ సర్జికల్ వార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం బోధన్ ఆసుపత్రి నుంచి నిజామాబాద్ జీజీహెచ్ వరకు ప్రత్యేక ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో నర్సింగ్




## సాలూరలో ఘనంగా గంగమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం

**బోధన్, నిజామాబాద్ జూన్29(డీడీ9 వార్త):**

సాలూర మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండి రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ వార్షికోత్సవ వేడుకలను దిగ్విజయం చేయడంలో విశేష సహకారం అందించిన సాలూర మండల ప్రజలకు, గ్రామస్తులకు గంగపుత్ర సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ఆలయ అభివృద్ధికి, సామాజిక



సేవా కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 39 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 39 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు.

ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విన్న కమిషనర్ వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్.ఐ, సి.ఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల స్థితిగతులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ .. ప్రజలు ఎటువంటి పైరవీలు, మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసు సేవలను స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు మరింత చేరువయ్యేలా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.






## బోధన్ పట్టణంలో ఘనంగా సత్యగంగా, వట సావిత్రి వ్రతాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరం భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. సత్యగంగా పౌర్ణిమ మరియు వట సావిత్రి వ్రతాల సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత శ్రద్ధాభక్తులతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మర్రిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్రతాన్ని ఆచరించిన మహిళలు తమ కుటుంబాల శ్రేయస్సును కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ మాట్లాడుతూ... జ్యేష్ఠ పౌర్ణమికి ఉన్న విశిష్టతను భక్తులకు వివరించారు. మహా పతివ్రత అయిన సావిత్రి దేవి తన భర్త సత్యవంతుని ప్రాణాలను కాపాడేందుకు వటవృక్షాన్ని ఆశ్రయించి చేసిన వ్రతం కాలక్రమేణా ఆచారంగా స్థిరపడిందని, నేటికీ ఆ పవిత్రత చెక్కుచెదరకుండా కొనసాగుతోందని పేర్కొన్నారు. గంగా స్నానం, వటవృక్ష పూజ మరియు దానధర్మాలు చేయడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు చేకూరుతాయని పురాణాలు చెబుతున్నాయని ఆయన తెలిపారు. భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ ఈ వేడుకల్లో ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.రాములు నాయకం, భక్తులు పాల్గొనపాల్గొన్నారు.



## బోధన్ ప్రజావాణిలో 4 ఫిర్యాదులు

**బోధన్, నిజామాబాద్ జూన్29(డీడీ9 వార్త):**

బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి ప్రజల నుంచి స్పందన తక్కువగా ఉంది. ఈ వారం జరిగిన కార్యక్రమంలో కేవలం నాలుగు ఫిర్యాదులు మాత్రమే అందినట్లు అధికారులు తెలిపారు. ఆర్డీఓ విజయకుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించబడింది. పలు సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు తమ వినతి పత్రాలను అధికారులకు అందజేశారు. వాటిని పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఆర్డీఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి: ఆర్డీఓ

**బోధన్, నిజామాబాద్ జూన్29(డీడీ9 వార్త):**


బోధన్ పట్టణంలో జరుగుతున్న ఓటరు ఎన్యూమరేషన్ ప్రక్రియను ఆర్డీఓ విజయ కుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బసవతారక నగర్, పాండు తర్ఫాలోని 72, 73 నంబరు బూత్‌లలో పనులను పరిశీలించిన ఆమె బీఎల్ఓలు, బీఎల్ఏలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్యూమరేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పని తీరును సమీక్షించి, పనుల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆర్డీఓ స్పష్టం చేశారు.



## చౌట్‌పల్లిలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

**నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలోని ప్రఖ్యాత శైవ క్షేత్రం శ్రీ ఉమా పార్థివ కోటి లింగేశ్వర స్వామి వారి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ, ఈ సందర్భంగా కైలాస మానస సరోవరం జలాలతో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకలను గురుంచి చంద్రశేఖర్ శర్మ వేద పండితుల బృందం వైదిక పద్ధతుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు గంగా ప్రసాద్ దీక్షితులు పరివారం, కౌటిక హన్మండ్లు గుప్తా, డాక్టర్ శివరాజ్, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఆర్మూర్ పట్టణంలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు

**నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

ఆర్మూర్ పట్టణంలోని భరత్ చంద్ర స్కూలులో జరిగిన సంఘటన నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆర్మూర్ పట్టణంలో జూన్ 29 ఉదయం 6 గంటల నుండి జూన్ 30 సాయంత్రం 5 గంటల వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం ఆర్మూర్ పట్టణంలో బంద్, ధర్నాలు, ర్యాలీలు మరియు రాస్తా రోకోలు నిషేధించబడ్డాయి. పట్టణంలో ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది వ్యక్తు



లు గుంపులుగా చేరడంపై నిషేధం విధించబడింది. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచామని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## మురికివాడల్లో ముమ్మరంగా పోలియో చుక్కల పంపిణీ

**నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం రెండవ రోజు సోమవారం ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా బూత్‌ల వద్ద పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారుల కోసం వైద్య సిబ్బంది గృహ సందర్శన చేపట్టారు.

నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని పూలాంగ్ బ్రిడ్జి పక్కన ఉన్న మురికివాడలో రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ సి.వెంకటరమణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అర్హులైన ప్రతి చిన్నారికి సోమవారం, మంగళవారం పోలియో చుక్కలు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్న ఆయన చిన్నారులకు చుక్కలు వేసిన తర్వాత వేసే మార్కింగ్‌ను పరీక్షించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అనిల్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అశోక్, డిహెచ్ఈలు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, హెచ్ఈవో వెంకట్ రవి, వినోద్, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ వాలంటీర్లు పాల్గొన్నారు.




## హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన ఇద్దరు కానిస్టేబుళ్లకు అభినందనలు

**నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఆదేశాల మేరకు ఈ పదోన్నతులు కల్పించబడ్డాయి. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సిబ్బంది నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రమోషన్ పొందిన వారికి కమిషనర్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జి.లింగం,రుద్రూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బి.శివకుమార్ గౌడ్ ఈ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.




## జిల్లాలో 99% పూర్తి చేసుకున్న పల్స్ పోలియో కార్యక్రమం

**నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా రెండవ రోజు సోమవారం బూత్‌ల వద్ద చుక్కలు వేయించుకోని ఐదేళ్లలోపు చిన్నారుల కోసం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినిలు మరియు ఎన్‌సిసి వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలను పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 1,91,883 మంది అర్హులైన చిన్నారులకు గాను, మొదటి రోజు 1,80,596 మందికి (94%) చుక్కలు అందించారు. రెండవ రోజు మిగిలిన వారిలో 9,264 మందికి చుక్కలు వేయడం జరిగింది. మొత్తంగా రెండు రోజుల్లో 1,88,760 మందికి, అంటే 99% లక్ష్యాన్ని చేరుకున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. మిగిలిన ఒక శాతం చిన్నారులకు మూడవ రోజు చుక్కలు వేసి, శతశాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని ఆమె వెల్లడించారు.

# తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్

**నిజామాబాద్ పోతంగల్ జూన్ 28(డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ దళిత, గిరిజన జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాదెపురం గంగన్న డిమాండ్ చేశారు ,తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ తరపున మా న్యాయమైన డిమాండ్లు ఆన్లైన్ ద్వారా అక్రిడేషన్ కార్డులకు దరఖాస్తు చేసిన దళిత, గిరిజన జర్నలిస్టులందరికీ వెంటనే అక్రిడిషన్ కార్డులు మంజూరు చేయాలి. అక్రిడిషన్ స్వతంత్ర (ఫ్రీలాన్స్/ప్రింట్ /ఎలక్ట్రానిక్/ డిజిటల్ /యూట్యూబ్) జర్నలిస్టులుగా కార్డులకు దరఖాస్తు చేసిన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులందరికి వెంటనే అక్రిడిషన్ కార్డులు జారీ చేయాలి అర్హులైన దళిత, గిరిజన జర్నలిస్టులందరికు హెల్త్ కార్డులను వెంటనే అమలు చేయాలి అర్హులైన దళిత, గిరిజన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలి దళిత, గిరిజన జర్నలిస్టులపై జరుగుతున్న వివక్షను పూర్తిగా నిర్మూలించి సమాన న్యాయం చేయాలి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల అక్రిడిషన్ కమిటీలలో మా అసోసియేషన్కు చెందిన ఇద్దరు ప్రతినిధులను సభ్యులుగా నియమించాలి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న దళిత, గిరిజన జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రియింబర్స్మెంట్ కల్పించాలి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను వెంటనే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించి ఉచిత విద్య అందేలా చర్యలు తీసుకోవాలి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద చేరిన విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, స్టూడెంట్ మెటీరియల్, యూనిఫార్పులు మరియు అవసరమైన అన్ని విద్యా సామగ్రిని పూర్తిస్థాయిలో ఉచితంగా అందించాలి 55 సంవత్సరాలు




దాటిన జర్నలిస్టులందరికీ నెలకు ₹20,000 పెన్షన్ అందించాలి ప్రతి జిల్లాలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్కు ప్రత్యేక ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటు చేయాలి జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలి అని కమిషనరేట్ ఆఫీసుకు ముట్టడి చేయడం జరిగింది మా డిమాండ్లను వెంటనే అమలు చేయాలి ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాల నుండి ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు లు అధిక సంఖ్య లో హైదరాబాద్ కు తరలి రావడం జరిగింది



## ఇందూరు తిరుమలలో ఘనంగా జ్యేష్ఠాభిషేకం, ఏరువాక పౌర్ణమి వేడుకలు

**నిజామాబాద్ జిల్లా జూన్29(డీడీ9 వార్త):**

ఇందూరు తిరుమల క్షేత్రంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన ధర్మకర్త శ్రీమాన్ నరసింహ రెడ్డి తెలిపారు. సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే జరిగే ఈ విశేష కార్యక్రమాల్లో భాగంగా జ్యేష్ఠ మాసంలో స్వామివారికి ప్రత్యేక 'జ్యేష్ఠాభిషేకం' నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణం కోసం, సమస్త లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ 'వరుణ యాగం' చేపట్టారు. వ్యవసాయానికి భూమి మాతృత్వాన్ని స్వీకరించాలని ప్రార్థిస్తూ, ఎద్దులు, నాగళ్లు మరియు ఇతర వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి, వాటికి కృతజ్ఞతలు తెలుపుతూ 'ఏరువాక పౌర్ణమి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను వేద పండితులు సంపత్ కుమార్ ఆచార్య, ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమార్ ఆచార్య, సాంబమూర్తి తదితరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన ధర్మకర్త శ్రీమాన్ నర్సింహారెడ్డిసుజాత దంపతులతో పాటు నర్సారెడ్డి, నరాల సుధాకర్, భాస్కర్, రాములు, గంగారెడ్డి, రాజేశ్వర్, సాయి రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భువనగిరి సమరభేరిని విజయవంతం చేయాలి

- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ**
- **ములుగు జిల్లా అధ్యక్షులు దిలీప్ కుమార్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

భువనగిరిలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి సభకు ముంజల బిక్ష పతి గౌడ్ బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు గారిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు *రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కోరే రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోరిక సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు శీలవంతుల సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు మొగిలిపల్లి వినోద, యువజన విభాగం నాయకులు గట్ల వినీత్, సోషల్ మీడియా ఇన్చార్జ్ విజయ్ తదితరులు పాల్గొని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, మహిళ రాజ్యాధికార సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## ఇబ్రహీంపూర్‌లో భూ రికార్డుల అక్రమాలపై విచారణకు డిమాండ్

**జనగామ జూన్ 29(డిడి 9వార్త )బ్యూరో**

రఘునాథ్ పల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామ పరిధిలో భూ రికార్డుల్లో జరిగిన అక్రమ మార్పులు, అనుమానాస్పద నమోదులపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామపంచాయతీ పాలకవర్గానికి వినతిపత్రం సమర్పించారు.



గ్రామ సమీపంలోని అనంతరాయగుట్ట వద్ద ఉన్న సర్వే నంబర్లు 374, 375కు చెందిన భూములు 2008లో ఓ ప్రైవేట్ సంస్థకు విక్రయించినప్పటికీ, అనంతరం అదే భూములు వివిధ ఉపసర్వే నంబర్లతో తిరిగి రికార్డుల్లో నమోదైనట్లు గ్రామస్థులు ఆరోపించారు. సర్వే నంబర్లు 374/A/1, 374/A/1/2, 375/C/1లలో భూములు ధరణి, అనంతరం భూభారతి పోర్టల్‌లో నమోదుకావడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

ఈ అంశంపై గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేయగా విచారణ అనంతరం డిలీషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ ప్రక్రియ నిలిచిపోయి, సంబంధిత భూములు మళ్లీ నమోదైనట్లు సమాచారం అందుతోందన్నారు. ఈ భూములను విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

ఈ విషయంపై స్పందించిన ఇబ్రహీంపూర్ సర్పంచ్ పోకల శ్రీనివాస్, రెవెన్యూ శాఖ అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసి విచారణ కోరాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింత నరేష్, గన్నోజు మధు, జోగు కుమార్, జోగు శ్రీకాంత్, పండుగ ప్రేమ్, దోరగొల్ల మహేష్, చింత రమేష్, గంగరబోయిన సురేష్, బండ్ర నరేష్‌తో పాటు గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.





## మెరిట్ విద్యార్థులకు చెవుల అమరేందర్ ప్రోత్సాహకాలు

**ములుగు, జూన్ 29 డీ డీ 9 వార్త :**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి మెరిట్ సాధించిన ప్రథమ ద్వితీయ శ్రేణి విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రముఖ సాఫ్ట్వేర్ ఇంజనీర్ చెవుల అమరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే ఏడవ తరగతి ఐదవ తరగతి చదివే విద్యార్థులకు సైతం ప్రథమ ద్వితీయ నగదు బహుమతులను అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదివే నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించాలని ఉద్దేశంతోనే నగదు బహుమతి అందించినట్లు ఆయన తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను కూడా ఇదే పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయి చేరుకున్నానని పేర్కొన్నారు. పదవ తరగతి, చదివి మెరిట్ సాధించిన ప్రథమ ద్వితీయ ర్యాంకర్లకు ఒక్కొక్కరికి 2000, 1500 ల చొప్పున నగదు బహుమతిని అందించారు. అలాగే ఏడవ తరగతి ఐదవ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూపాయలు 1500, ద్వితీయ బహుమతి రూపాయలు వెయ్యి చొప్పున విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి సురేష్ అధ్యక్షత వహించగా, గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతీ రమేష్, ఎంఈఓ ప్రభాకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూత్రాల రవి, ఉప సర్పంచ్ కొండ తిరుపతి, సింగపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వర్ అహ్మద్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు, పాల్గొన్నారు.

## పొరకలపల్లె పాఠశాలపై ఎంఈఓ ఫోకస్

- **ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి**
- **మండల విద్యాశాఖ అధికారి టి. ప్రభాకర్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

వెంకటాపురం మండలం పొరకల పల్లె గ్రామపంచాయతీకి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభించేందుకు మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ కృషి చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన భాస్కర్ అనే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లగా, మరో ఉపాధ్యాయురాలు విధులు నిర్వర్తించేది. ఈ నేపథ్యంలో పాఠశాలలో విద్యార్థులు రోజురోజుకు తగ్గిపోయి డి ఫంక్ స్కూల్ గా మారింది. ఈ పాఠశాలను ఎలాగైనా పునః ప్రారంభించాలని సంకల్పంతో ఎంఈఓ ప్రభాకర్ సోమవారం గ్రామానికి చేరుకొని, సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. తమ ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మధ్యాహ్న భోజనం



## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ములుగు జిల్లా పోలీస్ మరియు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహణ.




**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ గారు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా పోలీస్ శాఖ మరియు జిల్లా సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన డ్రగ్స్ అవగాహన ర్యాలీలో ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ గారు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత గారితో ముఖ్య అతిథిగా పాల్గొని, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి మూలమలుపు నుండి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం" అంటూ స్లోగన్స్ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్ గారు, ములుగు డి.ఎస్.పి రవీందర్ గారు, పస్ర సిఐ దయాకర్ గారు, ములుగు సీఐ సురేష్ గారు, ఎస్సై లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యార్థులు, యువత, సిబ్బంది పాల్గొన్నారు.





## అంతర్జాతీయ స్థాయిలో కందగట్ల గణేష్‌కు ద్విగుణ గౌరవ పురస్కారాలు

**జనగామ జూన్ 29(డిడి 9వార్త)బ్యూరో**

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని వెల్ది తెలంగాణ మోడల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్ అంతర్జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్ఠాత్మక గౌరవ పురస్కారాలను అందుకుని పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.

దక్షిణాఫ్రికాకు చెందిన పిలర్స్ ఆఫ్ పీస్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రపంచ శాంతి, మానవతా విలువల పరిరక్షణకు ఆయన అందించిన సేవలను గుర్తించి గౌరవ ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేసింది. అలాగే నైజీరియాకు చెందిన గ్లోబల్ ఇంటెలెక్చువల్ ఎక్స్ఛేంజ్ సంస్థ విద్యారంగంలో ఆయన చూపిన విశిష్ట ప్రతిభ, అంకితభావాన్ని గుర్తించి 'త్రైమాసిక అత్యుత్తమ ప్రతిభా పురస్కారం'తో సత్కరించింది.




ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికలపై పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బంది కందగట్ల గణేష్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన సాధించిన ఈ గౌరవాలు పాఠశాలకు, మండలానికి, జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.



## "కేకులు, స్వీట్ల కంటే అన్నదానం మిన్న"

- **9వ వార్డు కౌన్సిలర్ గండ్రకోట వాణి కుమార్ చేతుల మీదుగా ఆసుపత్రిలో అన్నదానం**
- **కొడుకు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసిన దంపతులకు అభినందనలు**

**డీ డీ 9 వార్త, ములుగు:**



పుట్టినరోజు సందర్భంగా కేకులు, స్వీట్స్, చాక్లెట్స్ పంచడం కంటే ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం వంటి అన్నదాన కార్యక్రమాలు చేయడం మేలని 9వ వార్డు కౌన్సిలర్ గండ్రకోట వాణి కుమార్ అన్నారు. 9వ వార్డుకు చెందిన రంజిత రాజుల కుమారుడు శ్రీమన్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి కౌన్సిలర్ వాణి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రోగులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "నేటి సమాజంలో పుట్టినరోజు వేడుకలు ఆర్భాటంగా చేస్తున్నారు. కానీ రంజిత రాజుల కుటుంబం తమ పిల్లాడి బర్త్ డేను పురస్కరించుకొని ఆసుపత్రిలోని రోగులకు అన్నదానం చేయడం నిజంగా అభినందనీయం. పుట్టినరోజు సందర్భంగా కేకులు, స్వీట్స్, చాక్లెట్స్ పంచడం కంటే ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు చేయడం వల్ల నలుగురి ఆకలి తీరుతుంది. ఇది సమాజానికి గొప్ప సందేశం" అని అన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు రెండు నుంచి మూడు వందల మంది రోగులు, వారి సహాయకులు పాల్గొని భోజనం చేశారు. చిన్నారి శ్రీమన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కౌన్సిలర్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రంజిత రాజుల దంపతులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధల మధ్య మడేలేశ్వర స్వామి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **స్వామి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.**

**మణుగూరు.జూన్ 29 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,అశ్వాపురం మండల కేంద్రంలోని శ్రీ మడేలేశ్వర స్వామి జాతర మహోత్సవాల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.జాతర ప్రాంగణంలో భక్తుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన నూతన హ్యాండ్‌బోర్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. అలాగే జాతరకు విచ్చేసిన భక్తులను ఆయన ఆప్యాయంగా పలకరించి మడేలేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊస అనిల్ కుమార్, బూరెడ్డి వెంకటరెడ్డి, తుక్కాని మధుసూదన్ రెడ్డి, వేములపల్లి రమేష్, సర్పంచ్‌లు బనోత్ సదర్లాల్, ఏనిక ఉషారాణి, ఇర్పా కవిత, కుంజా జాను, కూడా కృష్ణ, ఉపసర్పంచ్‌లు హర్షా నాయక్, శీలం సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సోడే వెంకటేశ్వర్లు, కాకా రాములు, జినకా నాగయ్య, మాదినేని



రాంబాబు, తూము వీరరాఘవులు, ఆవుల రవి, లంకమల్ల కొండలరావు, తెల్లం వీరభద్రం, ఏనిక రవి, తెల్లం వెంకటేశ్వర్లు, రానబోతుల రామిరెడ్డి, కుందూరు శ్రీనివాసరెడ్డి, నూకల సంపత్, తాటి రాంబాబు, రావులపల్లి నరసింహారావు, గొల్లపల్లి నరేష్, కోలా శశికాంత్, రావుల వీరభద్రం, బాలిన నరేష్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆధునిక సైన్స్ విద్యకు మరో ముందడుగు..

- **సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూన్ 29 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం లంక మల్లారం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ఉన్నతీకరించబడిన జూనియర్ కళాశాలలో రూ.13.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సైన్స్ ల్యాబ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పట్టణ స్థాయి విద్యా సౌకర్యాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.సైన్స్ ల్యాబ్ అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపరుచుకుని ఉన్నత విద్యలో రాణించే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే పాయం పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా వారాంతపు మెనూ, భోజన నాణ్యత, హాస్టల్‌లో కల్పిస్తున్న వసతుల గురించి హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, వసతి, విద్యా సౌకర్యాలు, ఇతర సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి, అన్ని విద్యా సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఘనం గా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

- **పాల్గొని పూజలు చేసిన శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్**

**మంగపేట జూన్29డీడీ 9 వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామం లో ఎస్సీ కాలనీలో కొత్తగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం రోజున పూజారులు గోనె రజిత,రామయ్య ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శాస్త్రోక్తం గా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిది గా శ్రీ రామకృష్ణ సేవ ట్రస్టు చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్ పాల్గొన్నారు.వారిని సాదరంగా ఆహ్వానించి శాలువ కప్పి డప్పుమేలాల తో ఆలయం లోకి స్వాగతించారు. ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల BRS పార్టీ సీనియర్ నాయకులు చిలక మర్రి రాజయ్య, పూస ఉపేందర్ ,పూసల నరసింహారావు, జిమట నాగేష్,తోకల జగదీష్, పూస వినయ్, గోనె విష్ణు, గోనె బాలు, పూస వేణు, పూస స్వామి,బోడ లక్ష్మి నారాయణ, పూస సనిత్ కుమార్, యశ్వంతు, సిద్దు, గోనె జగన్ అకినేపల్లి మల్లారం గ్రామ కమిటీ అధ్యక్షులు రూపా భద్రయ్య,తిమ్మాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమరం పుల్లారావు,శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ వైస్ చైర్మన్ బాడిశ నవీన్ ట్రస్ట్ సభ్యులు మునిగేల మహేష్,మండల సంతోష్, సోషల్ మీడియా విభాగం మునిగేల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీలో అక్రమాలపై విచారణకు వినతి.

- **అర్హులైన ప్రతి జర్నలిస్టులకు న్యాయం చేయాలని మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ డిమాండ్..**

**మణుగూరు, జూన్ 29 (డి డి 9వార్త)**



జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు చోటు చేసుకున్నాయని వస్తున్న ఆరోపణలు, కార్డుల జారీలో అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన నిజమైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలు విస్తృతంగా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం వార్తలు సేకరించి ప్రచురిస్తున్న పలువురు అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాకపోగా, తగిన సర్క్యులేషన్ లేదా ప్రచురణ ప్రమాణాలు లేని కొన్ని పత్రికలకు కూడా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి డిపిఆర్ఓ పర్యవేక్షణా లేమితో జర్నలిజాన్ని ప్రధాన వృత్తిగా నిర్వహించని కొందరు రాజకీయ నాయకులు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యక్తులు, మద్యం దుకాణాల్లో పనిచేస్తు న్న వారికి కూడా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోందని, ఈ అంశాలపై నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలని కోరారు.అంతేకాక అర్హతలపై సందేహాలు ఉన్న కొందరికి కార్డులు జారీ అయినట్లు ప్రచారం జరుగుతోందని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరిగిందా లేదా అనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించాలని, విచారణలో అక్రమాలు తేలితే అనర్హులకు జారీ చేసిన కార్డులను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. అలాగే అన్యాయానికి గురైన అర్హులైన నిజమైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, భవిష్యత్తులో ఈ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై వినతి పత్రం అందించేం దుకు జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) కార్యాలయానికి వెళ్ళగా అక్కడ ఖాళీ కుర్చీలే దర్శనమి స్తున్నాయని, ఉదయం 11.20 గంటలు దాటినా డిపిఆర్ఓ ఉద్యోగుల సీట్లు ఖాళీగా కనిపించడం సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అత్యవసర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, జర్నలిస్టులకు సంబంధిత అధికారి, ఉద్యోగులు

అందుబాటులో లేకపోవడంతో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# ఆర్జీ1లో పారదర్శకంగా క్వార్టర్ కౌన్సెలింగ్

- **125 దరఖాస్తుల్లో 42 మందికి నచ్చిన క్వార్టర్ల కేటాయింపు**
- **ఉద్యోగుల సంక్షేమమే సంస్థ లక్ష్యం: ఎస్.ఓ.టు జీఎం చంద్రశేఖర్**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

సింగరేణి రామగుండం ఏరియా 1లో విధులు నిర్వహిస్తున్న మంత్లీ రేటెడ్, డైలీ రేటెడ్ ఉద్యోగుల కోసం చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సెలింగ్‌ను ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్వార్టర్ అలాట్‌మెంట్ కమిటీ ప్రతినిధులుగా ఎస్.ఓ.టు జీఎం కె. చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్లు రవీందర్ రెడ్డి, తిరుపతి పాల్గొని కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు.

ఈ కౌన్సెలింగ్‌లో డీ, టీ2, ఎంఎడీ, ఎస్‌టీఈ 2 క్వార్టర్లతో పాటు ఐబీ కాలనీ, శారదానగర్, బస్టాండ్ కాలనీ, జీఎం ఆఫీస్ కాలనీ, పవర్ హౌస్ కాలనీ, జవహర్ నగర్, తిలక్ నగర్ ప్రాంతాలకు చెందిన మొత్తం 354 చేంజ్ ఆఫ్ క్వార్టర్లు అందుబాటులో ఉండగా, 125 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 42 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. మిగిలిన వారికి సంస్థ నిబంధనల ప్రకారం కేటాయింపులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.ఓ.టు జీఎం కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి యాజమాన్యం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి వివక్షకు తావులేకుండా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్లు రవీందర్ రెడ్డి, తిరుపతి, గుర్తింపు ప్రాతినిధ్య సంఘం బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఫిరోజ్ ఖాన్, సంక్షేమ అధికారి నాగరాజు, పీఓఏ దేవాచారి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, సెక్యూరిటీ సిబ్బంది శ్రీకాంత్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

- **భద్రాచలం ఎమ్మెల్యే డా. వెంకట్రావు**
- **ఘనంగా టియుడబ్ల్యుజె (ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ**

**భద్రాచలం , జూన్ 29 డిడి9 వార్త**

సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని రాఘవ నిలయం ( రెడ్డి సత్రం) నందు జరిగిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ ఆ యూనియన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బి. వి. రమణారెడ్డి,జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జునుమాల రమేష్ ల సమక్షంలో విజ్జిగిరి రాజా కిరణ్ సభాక్షతన జరిగింది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిజం రంగంలో పని చేస్తున్న విలేకరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమ కార్యక్రమాల అమలుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

**ఘనంగా టియుడబ్ల్యుజె (ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ**

అనంతరం యూనియన్ భద్రాచలం డివిజన్ మహాసభ జరిగింది. అధ్యక్షుడిగా భూక్య రంజిత్ నాయక్, ఉపాధ్యక్షులుగా బండారి మహేష్ యాదవ్, కాటా సత్యం, పందేలపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పరుచూరి రవీంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా షేక్ ఖాసిం, పసుపులేటి బాబు, కోశాధికారిగా బొల్లె రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా విజయ్, బోళ్ళ వినోద్, సతీష్, వాకచర్ల శ్రీనివాసరావు, అనిల్, వెంకట్, గోసుల వెంకటేశ్వరరావులు ఎంపికయ్యారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా శ్రీహరి, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, పాకాల శివగౌడ్, కార్యదర్శిగా జయరాం, సహాయ కార్యదర్శులుగా కాసబోయిన మోహన్ రావు, జెట్టి రామకృష్ణ, కోశాధికారిగా బాల కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అన్వేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రామ లక్ష్మణ్, జగన్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా,అధ్యక్ష కార్యదర్శులు, పలువురు ప్రముఖులు, భద్రాచలం డివిజన్ లోని మీడియా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ లో యూనియన్ పటిష్టతకు శక్తివంచన లేకుండా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.





# కార్మిక ఉద్యమాల అజరామర యోధుడు కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్‌రావు

- **సింగరేణి కార్మిక హక్కుల కోసం జీవితాన్నే అంకితం చేసిన మహానేత**
- **35వ వర్ధంతి సందర్భంగా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్న ఆళవందార్ వేణుమాధవ్**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**



నాయకుడు అంటే పదవులు అనుభవించేవాడు కాదు... ప్రజల కష్టాల్లో ముందుండి పోరాడేవాడు" అనే మాటకు సజీవ నిదర్శనంగా నిలిచిన కార్మిక ఉద్యమ నేత కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్‌రావు అని ఆళవందార్ వేణుమాధవ్ పేర్కొన్నారు. జూన్ 30న ఆయన 35వ వర్ధంతి సందర్భంగా విడుదల చేసిన స్మారక సందేశంలో భాస్కర్‌రావు సేవలను కొనియాడారు.

1930 డిసెంబర్ 6న జన్మించిన భాస్కర్‌రావు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ టి.బి. విఠల్‌రావు ప్రోత్సాహంతో 1960లో గోదావరిఖనికి వచ్చి సింగరేణి కార్మిక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అప్పటి కార్మికుల దయనీయ పరిస్థితులను గమనించిన ఆయన తన జీవితాన్ని కార్మికుల హక్కుల సాధనకే అంకితం చేశారని తెలిపారు.

ఏఐటీయూసీ పతాకం కింద కార్మికులను సంఘటితం చేసి, వేతన సవరణలు, బోనస్, గని భద్రత, ప్రమాద బీమా, నివాస గృహాలు, తాగునీరు, వైద్య సేవలు, విద్య, పదవీ విరమణ ప్రయోజనాల కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. కార్మిక సంఘం అంటే కేవలం వేతనాల కోసం పోరాడే వేదిక మాత్రమే కాకుండా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు నిలబడే శక్తిగా తీర్చిదిద్దిన నాయకుడని పేర్కొన్నారు. గనుల కాలనీల్లో కార్మికుల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన నిరాడంబర నాయకుడిగా భాస్కర్‌రావు ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. పదవుల కోసం కాకుండా సిద్ధాంతాల కోసం జీవించిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానం విస్తరణ, కార్మిక హక్కులపై పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో భాస్కర్‌రావు ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాసంగికమని పేర్కొన్నారు. సంఘటిత కార్మిక ఉద్యమమే హక్కులను కాపాడగలదన్న ఆయన సందేశం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. 1991 జూన్ 30న భౌతికంగా దూరమైనా, సింగరేణి గనుల్లో ప్రతి హక్కుల పోరాటంలో, ప్రతి కార్మిక ఉద్యమ నినాదంలో కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్‌రావు స్ఫూర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆళవందార్ వేణుమాధవ్ పేర్కొన్నారు. పూలమాలలు వేయడమే కాకుండా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

# బయక్క పేట ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన నార్లపూర్ ఎస్ఐ అచ్చ కమలాకర్

**తాడ్వాయి మండలం జూన్ 29 (డిడి9 వార్త )**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయక్క పేట గ్రామంలోని ఏ యు పిజి ఎస్ పాఠశాలలో గుత్తి కోయ విద్యార్థులకు జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథన్ కేకన్ ఆదేశాల మేరకు నార్లాపూర్ ఎస్సై అచ్చ కమలాకర్ స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ,క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని అన్నారు. విద్యార్థులు మదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ సూచించారు. కష్టపడి కాకుండా చదువుపై ఇష్టం పెంచుకొని చదవాలని , విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎస్సై హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసుసిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.





## అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల విక్రయిస్తే దాడులు తప్పవు: ఏఐఎస్ఎఫ్

- **విద్యను వ్యాపారంగా మార్చడం దారుణం: రేణుకుంట్ల ప్రీతం**
- **నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్**
- **తల్లిదండ్రులపై కోట్ల రూపాయల భారం మోపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ... "నో ప్రాఫిట్ -నో లాస్" విధానంలో పాఠ్యపుస్తకాలు విక్రయించాల్సి ఉండగా, కార్పొరేట్ విద్యాసంస్థలు డిస్ట్రిబ్యూటర్లతో కుమ్మక్కై అధిక లాభాలు ఆర్జిస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని ఆరోపించారు.


పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాంలను కూడా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారని, జీఎస్టీ పేరుతో విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన విద్యాసంస్థలే విద్యను వ్యాపారంగా మార్చడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతోందని అన్నారు.

కొన్ని పాఠశాలలు ప్రత్యేక బుక్‌స్టాల్స్ ఏర్పాటు చేసి, అక్కడే పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నాయని ఆరోపించారు. అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న పాఠశాలల అనుమతులను వెంటనే రద్దు చేయాలని, స్పందించని విద్యాశాఖ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్, నాయకులు తడిగొప్పుల అనుప్ సాయి, ఆరే జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



- **పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యను కలిసి వినతిపత్రం అందజేసిన అకెనపల్లి సర్పంచ్ గాదె స్రవంతి–సుధాకర్**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

అంతర్గాం మండలం అకెనపల్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని విధాలుగా సహకారం అందించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్ సోమవారం పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవోను శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్ మాట్లాడుతూ... అంతర్గాం మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా అనేకం ఉన్నాయని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు అకెనపల్లి గ్రామానికి కూడా ప్రత్యేక నిధులు మంజూరు చేసి రహదారులు, మౌలిక సదుపాయాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరినట్లు చెప్పారు. గ్రామాలను పరిశుభ్రంగా, సుందరంగా, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వినతిపై స్పందించిన ఆర్డీవో గంగయ్య, ప్రభుత్వ నిబంధనల మేరకు అంతర్గాం మండలంలోని గ్రామాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్ తెలిపారు.

## 29 ఏళ్ల సేవకు ఘన వీడ్కోలు

- **హుజూరాబాద్ డిపోలో పదవీ విరమణ పొందిన ఆర్టీసీ డ్రైవర్ గౌరిశెట్టి వీరయ్య దంపతులకు ఘన సన్మానం**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హుజూరాబాద్ డిపోలో 29 సంవత్సరాల పాటు డ్రైవర్‌గా విశిష్ట సేవలందించిన గౌరిశెట్టి వీరయ్య జూన్ 30న పదవీ విరమణ పొందనున్న సందర్భంగా సోమవారం డిపో ఆవరణలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డిపో అధికారులు, సహోద్యోగులు, బంధువులు, మిత్రులు కలిసి వీరయ్య దంపతులను శాలువాలతో సత్కరించి, పూల బొకేలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సంస్థకు అందించిన సేవలను కొనియాడుతూ పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, ఆనందంగా, ప్రశాంతంగా శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొని గౌరిశెట్టి వీరయ్య దంపతులకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. సంస్థలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యెనిమిండ్ల శ్రీనివాస్, రామన్న, లచ్చన్న, వెలగందుల సత్యనారాయణ, శివనాథుల వెంకటరమణ, లింగమూర్తి, కృష్ణమూర్తి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొని వీరయ్య దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.




# పెరిక సమాజ ఐక్యతకు నూతన కార్యవర్గం శ్రీకారం

- **యాదాద్రి భువనగిరి జిల్లా పెరిక కుల సంఘం నూతన కార్యవర్గం ఘన ప్రమాణ స్వీకారం**
- **సమాజ అభివృద్ధి, యువత సాధికారతకు సమిష్టి కృషి చేయాలని నాయకుల పిలుపు**
- **కోకాపేట పెరిక కుల భవన నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం అందించిన కందుల సంధ్యారాణి**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

యాదాద్రి భువనగిరి జిల్లా పెరిక కుల సంఘం నూతన అధ్యక్షుడిగా తిప్పని పరమేష్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం యాదగిరిగుట్టలోని ఎస్ఎన్ఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పెరిక కుల పెద్దలు, సంఘ నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా నాయకులు, కుల బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గటిక విజయ్ కుమార్ మాట్లాడుతూ...., పెరిక సమాజ అభివృద్ధికి విద్య, ఉపాధి, యువత సాధికారత, మహిళల భాగస్వామ్యం, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఒక్కరూ సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీలు సమన్వయంతో పనిచేస్తే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు.

నూతన అధ్యక్షుడు తిప్పని పరమేష్ మాట్లాడుతూ.... సంఘ అభివృద్ధి, యువతకు ప్రోత్సాహం, సామాజిక సేవా కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యం ఇస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పెరిక సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కోకాపేటలో నిర్మించనున్న పెరిక కుల భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి రూ.1,00,000 విరాళాన్ని అందజేశారు. ఆమె చేసిన ఈ సేవను సభలో పాల్గొన్న నాయకులు, సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కుల కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మద్దే లింగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్, రాష్ట్ర మహిళా నాయకురాలు కందుల సంధ్యారాణి, మహిళా ప్రధాన కార్యదర్శి మంచాల వరలక్ష్మి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బంధు శ్రీధర్ బాబు, యువజన విభాగం అధ్యక్షుడు దాసరి జయప్రకాశ్, ట్రస్ట్ అధ్యక్షుడు అరె శ్రీనివాస్‌తో పాటు వివిధ జిల్లాల సంఘ నాయకులు, గ్రామ శాఖల ప్రతినిధులు, కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.




## ఏబీఏపీ తెలంగాణ వాలంటీర్ కమాండెంట్‌గా జనగామ తిరుపతి

- **అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన వాలంటీర్ కమాండెంట్‌గా పెద్దపల్లి జిల్లా, ఎన్టీపీసీ నివాసి జనగామ తిరుపతి నియమితులయ్యారు.

ఆదివారం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి క్షేత్రంలో జరిగిన ఏబీఏపీ తెలంగాణ రాష్ట్ర సమావేశంలో జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, ఉపాధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు, కార్యదర్శి బెల్లపు హరిప్రసాద్, కోశాధికారి రాయబారపు రవికుమార్, ట్రస్ట్ సభ్యుడు రాచర్ల రమేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. పుల్లంరాజు తదితరుల సమక్షంలో రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఏబీఏపీ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్ఓ) గా సేవలందించిన జనగామ తిరుపతి, వాలంటీర్ కమాండెంట్‌గా పదోన్నతి పొందారు.

ఈ సందర్భంగా జనగామ తిరుపతి మాట్లాడుతూ...., గురుస్వాముల ఆశీర్వాదంతో స్వామి అయ్యప్ప సేవలో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నానని తెలిపారు. క్రమశిక్షణ, సేవ, భక్తి అనే మూడు సూత్రాలతో స్వచ్ఛంద సేవా దళాన్ని మరింత బలోపేతం చేస్తానని, ఇరుముడి యాత్ర నుంచి పడిపూజ వరకు ప్రతి కార్యక్రమంలో భక్తులకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పీఆర్ఓగా వచ్చిన అనుభవంతో భక్తులకు, సంస్థకు వారధిగా పనిచేస్తానని చెప్పారు.

ఈ సందర్భంగా ఏబీఏపీ వివిధ హోదాల్లోని సభ్యులు, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు, పలువురు మిత్రులు జనగామ తిరుపతికి శుభాకాంక్షలు తెలియజేశారు.





## క్రైమ్ ఫ్రీ డివిజన్లే లక్ష్యం

- **ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి..**
- **గోదావరిఖని వన్‌టౌన్ స్టేషన్ తనిఖీల్లో డీసీపీ బి. రామ్‌రెడ్డి సూచనలు**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

ప్రజల భాగస్వామ్యంతో ప్రతి డివిజన్‌ను నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని పెద్దపల్లి జోన్ డీసీపీ బి. రామ్‌రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీసీపీ పోలీసు సిబ్బందితో పరేడ్ నిర్వహించి స్క్వాడ్ డ్రిల్, నీట్ టర్నౌట్‌ను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. తదనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని తగిన సూచనలు చేశారు.

అనంతరం 35 డివిజన్లకు చెందిన డివిజన్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ, ప్రతి డివిజన్‌లో ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలపై నేరాలు, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నంబర్ ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. యువతను గంజాయి, మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని, స్ట్రీట్ కార్నర్ సమావేశాలు, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. అలాగే ప్రతి డివిజన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు వారానికి రెండు నుంచి మూడు సార్లు స్థానికంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని డీసీపీ బి. రామ్‌రెడ్డి సూచించారు.

ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, అఫ్జలుద్దీన్, ఎస్ఐలు రమేష్, మనోహర్, అనూషతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- **వాణి స్కూల్‌లో పుస్తకాల విక్రయాలపై ఎంఈఓ చర్యలకు హర్షం.. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

సెంటెనరీ కాలనీలోని వాణి స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులపై మండల విద్యాశాఖ అధికారి స్పందించి సంబంధిత పుస్తకాల విక్రయ కేంద్రంపై చర్యలు తీసుకోవడాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు స్వాగతించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్యలు ఏ విద్యాసంస్థలోనూ జరగకూడదన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన విద్యాసంస్థల్లో పారదర్శకత, నిబంధనల అమలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు, పాఠ్యపుస్తకాల విక్రయ నిబంధనలు, వినియోగదారుల హక్కులు, విద్యాశాఖ మార్గదర్శకాలను ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ తప్పనిసరిగా పాటించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, తప్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తల్లిదండ్రులకు జరిగిన నష్టానికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ విద్యార్థి నాయకుడు ఎండీ వాజిద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, కాళేశ్వరం డైరెక్టర్ కాటన్ సత్యం, కాంగ్రెస్ నాయకుడు దాసరి శివ, బీజేపీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు తీగల శ్రీధర్, దంతుల సురేష్‌తో పాటు అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## గ్రామీణ యువతకు ఎన్టీపీసీ అండ

- **పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్‌కు శ్రీకారం.. స్థానికంగానే నాణ్యమైన శిక్షణ**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఎన్టీపీసీ రామగుండం మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యువత నైపుణ్యాభివృద్ధి, సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ దీప్తి మహిళా సమితి సహకారంతో ఆరు నెలల పోటీ పరీక్షల కోచింగ్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది.

ఎన్టీపీసీ పరిధిలోని లైఫ్ స్కిల్ అకాడమీ, సాయి సేవా సమితిలో ప్రారంభమైన ఈ కోచింగ్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణను స్థానికంగానే అందించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, అధ్యయన సామగ్రి, శిక్షణను ఈ కార్యక్రమం ద్వారా అందించనున్నారు.

ఇప్పటి వరకు పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలకు వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు కోచింగ్ ఫీజులు, హాస్టల్, స్టడీ హాల్, పుస్తకాల కోసం భారీగా ఖర్చు చేయాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఎన్టీపీసీ స్థానికంగానే నాణ్యమైన కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా యువతలో పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ సమాజాభివృద్ధికి ఎన్టీపీసీ రామగుండం నిరంతరం కృషి చేస్తోందని, ఈ కోచింగ్ కార్యక్రమం యువత భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అధికారులు పేర్కొన్నారు.



# గుండెకు గట్టి భరోసా.. సింగరేణి క్యాథ్ ల్యాబ్ సిద్ధం

- **గోల్డెన్ అవర్‌లోనే గుండెకు ప్రాణరక్షక వైద్యం**
- **కార్మిక హృదయాలకు సింగరేణి భరోసా**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**

బొగ్గు బెల్ట్ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలను అందించేందుకు సింగరేణి సంస్థ మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రామగుండం-1 ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో అమూల్యమైన "గోల్డెన్ అవర్"లోనే చికిత్స అందించగల ఈ కేంద్రం వేలాది మంది ప్రాణాలకు భరోసాగా నిలవనుంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు ఏడాదిలోనే ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం. గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి, పెద్దపల్లి, మంథని ప్రాంతాలతో పాటు ఉత్తర తెలంగాణలోని లక్షలాది మంది ప్రజలకు ఈ కేంద్రం ద్వారా అత్యాధునిక గుండె వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఇప్పటి వరకు గుండెపోటు వచ్చిన రోగులను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలకు తరలించాల్సి వచ్చేది. ఈ ప్రక్రియలో అత్యంత కీలకమైన తొలి గంట వృథా కావడంతో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉండేది. ఇకపై గోదావరిఖనిలోనే యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక వంటి అత్యవసర చికిత్సలు అందుబాటులోకి రావడంతో విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం మరింత పెరగనుంది.

సింగరేణి సంస్థ కార్మికుల ఆరోగ్య సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఏడాది రూ.300 కోట్లకు పైగా వైద్య సేవల కోసం ఖర్చు చేస్తోంది. గత ఏడాది మాత్రమే సుమారు 3 వేల మంది గుండె సంబంధిత రోగులను కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ గుండె వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేసింది.

మొత్తం 7,890 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కార్డియాలజీ విభాగంలో 5 పడకల ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్ (ఐసీసీయూ), 10 పడకల ఐసీయూ, ప్రత్యేక ఔట్ పేషెంట్ బ్లాక్, అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, ప్రత్యేక శిక్షణ పొందిన వైద్య సిబ్బంది 24 గంటల సేవలు అందించనున్నారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టుకు సింగరేణి సంస్థ ఏడేళ్లలో దాదాపు రూ.50 కోట్ల వ్యయం చేయనుంది. ప్రతి నెల సుమారు 3 వేల మంది ఈ సేవలను వినియోగించుకుంటారని అంచనా. ఇందులో 50 శాతం పడకలను సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులకు కేటాయించనున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం టారిఫ్‌ల మేరకు స్థానిక ప్రజలకు కూడా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించనున్నారు.






ఈ క్యాథ్ ల్యాబ్‌లో రక్తనాళాల పరీక్షలు, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక, ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ వంటి అన్ని ఆధునిక గుండె చికిత్సలు అందుబాటులో ఉంటాయని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ తెలిపారు. గుండెపోటు బాధితులకు గోల్డెన్ అవర్‌లోనే చికిత్స అందించి వేలాది మంది ప్రాణాలను కాపాడే ప్రాణరక్షక కేంద్రంగా గోదావరిఖని క్యాథ్ ల్యాబ్ నిలవనుందని ఆయన పేర్కొన్నారు.

# జనగామ చెరువును కాపాడండి

- **కాలుష్య జలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజావాణిలో వినతి**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 29 (డీడీ9 వార్త):**



జనగామ గ్రామానికి జీవనాధారమైన చెరువును కాలుష్య బారినుంచి కాపాడాలని కోరుతూ రామగుండం కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామిని రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్యామిని రమేష్ మాట్లాడుతూ..., గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం నుంచి వస్తున్న డ్రైనేజీ మురుగునీరు నేరుగా జనగామ చెరువులోకి చేరడంతో గ్రామ ప్రజలు, రైతులు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎస్‌టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, శుద్ధి చేసిన నీటినే చెరువులోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జనగామ చెరువుపై ఆధారపడి సుమారు 250 కుటుంబాలు, 350 ఎకరాల సాగుభూమి జీవనోపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు. కలుషిత నీటి కారణంగా పంటల దిగుబడి తగ్గడం, పశువులు నీరు తాగలేని పరిస్థితి ఏర్పడడం, చెరువులో ఆక్సిజన్ శాతం తగ్గి చేపలు మృతి చెందడంతో ముదిరాజ్, బెస్త వర్గాలకు చెందిన మత్స్యకారులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని వివరించారు. సింగరేణికి బొగ్గు అందించిన జనగామ నేడు కాలుష్యంతో ఇబ్బందులు పడుతోంది. జనగామ చెరువును కాపాడి గ్రామానికి జీవం పోయాలి అంటూ అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలవేన రవీందర్, అరెళ్ల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ABAP తెలంగాణకు నూతన వాలంటీర్ కమాండెంట్ గా జనగామ తిరుపతి నియామకం.

**డిడి9వార్త /రామగుండం జూన్ 30:**

అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ (ABAP) తెలంగాణ రాష్ట్ర శాఖకు నూతన వాలంటీర్ కమాండెంట్ గా పెద్దపల్లి జిల్లా ఎన్ టి పి సి, గోదావరిఖని నివాసి జనగామ తిరుపతి నియమితులయ్యారు. ఆదివారం పవిత్ర బాసర జ్ఞాన సరస్వతి క్షేత్రంలో జరిగిన ABAP తెలంగాణ రాష్ట్ర సమావేశంలో జాతీయ అధ్యక్షులు అయ్యప్ప దాస్ , ఉపాధ్యక్షులు బేతి తిరుమల్ రావు , కార్యదర్శి బెల్లపు హరి ప్రసాద్, కోశాధికారి రాయబారపు రవికుమార్ , ట్రస్ట్ సభ్యులు రాచర్ల రమేష్ గారు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు టి వి పుల్లం రాజు మరియు తెలంగాణ రాష్ట్ర సభ్యుల సమక్షంలో రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. జనగామ తిరుపతి గారు నిన్నటి వరకు ABAP తెలంగాణ విభాగంలో *పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పి ఆర్ ఓ ) గా సేవలందించారు అని తెలిపారు. నూతన వాలంటీర్ కమాండెంట్ జనగామ తిరుపతి మాట్లాడుతూ "గురుస్వాముల ఆశీర్వాదంతో, స్వామి అయ్యప్ప వారి ఆజ్ఞగా ఈ గురుతర బాధ్యతను స్వీకరిస్తున్నాను అని క్రమశిక్షణ, సేవ, భక్తి అనే మూడు సూత్రాలతో ఏ బి ఏ పి,స్వచ్ఛంద సేవా దళాన్ని బలోపేతం చేస్తాను అని ఇరుముడి యాత్ర నుండి పడిపూజ వరకు ప్రతి కార్యక్రమంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా సేవ చేయడమే నా లక్ష్యం అని అన్నారు . పి ఆర్ ఓ,గా లభించిన అనుభవంతో భక్తులకుసంఘానికి వారధిగా పనిచేస్తాను" అని తెలిపారు. పదవి ఏదైనా లక్ష్యం ఒక్కటే అయ్యప్ప సేవ అని ఆయన పేర్కొన్నారు. "తత్త్వమసి" అనే మహా వాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని భక్తుల సహకారంతో బాధ్యతలు నిర్వర్తిస్తానని ఆయన విన్నవించారు. ఏ బి ఏ పి,వివిధ హోదాలలో ఉన్న సభ్యులు , గురుస్వాములు, స్వాములు మరియు పలు పక్షాల మిత్రులు నూతన వాలంటీర్ కమాండెంట్ జనగామ తిరుపతి కి శుభాకాంక్షలు తెలిపారు.



# రూ. 2.40 కోట్లతో పెద్దబొంకూరు హైలెవల్ వంతెన.

- **రూ. 12 కోట్లతో నిట్టూరు నుంచి కాచాపూర్ వరకు నూతన బీటీ రోడ్డు.**
- **రూ. 40 లక్షలతో పెద్దకలవల శివాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు.**
- **అభివృద్ధి పథంలో పెద్దపల్లి నియోజకవర్గం.**
- **అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త /పెద్దపల్లి జూన్ 30:**

పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు గ్రామంలో రూ.2.40 కోట్లతో నూతనంగా నిర్మించిన హై లెవెల్ వంతెన మరియు రూ.12 కోట్లతో నూతనంగా నిర్మాణం చేపట్టిన నిట్టూరు నుండి కాచాపూర్ వరకు నూతన బీటీ రోడ్డు ను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలోని CGF నిధులతో శివాలయం లో రూ. 40 లక్షలతో నూతన రాజగోపురం మరియు అర్చకుల వసతి గృహ నిర్మాణానికి ప్రభుత్వ విప్ విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..పెద్దపల్లి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గం గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. పెద్దబొంకూరు నుండి కొలనూరు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల సౌకర్యార్థం అలాగే పెద్దబొంకూరు గ్రామ ప్రజల రవాణా ఇబ్బందులను గుర్తించి రూ. 2.40 కోట్లతో నూతన హై లెవెల్ వంతెన నిర్మించడం జరిగిందని వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందిగా మారకుండా ఉండేందుకు వంతెన నిర్మించడం జరిగిందని అలాగే పెద్దపల్లి మండలం నిట్టూరు నుండి కాచాపూర్ వరకు మండలాలను అనుసంధానం చేస్తూ రూ. 12 కోట్లతో నిర్మించిన నూతన బిటి రోడ్డును ఈరోజు సోమవారం రోజున ప్రారంభించుకోవడం జరిగిందని గ్రామాల నుండి మండల కేంద్రాలకు మరియు మండలాల నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వెళ్ళే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచే విధంగా నూతనంగా రోడ్లను నిర్మాణం చేపట్టడం జరుగుతుందని గుర్తు చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా నూతన బస్ డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, నూతన పోలీస్ స్టేషన్లు, పెద్దపల్లి మరియు సుల్తానాబాద్ మున్సిపాలిటీల అభివృద్ధి, అమృత్ పథకం, హై లెవెల్ వంతెనలు, డబల్ లైన్ల రోడ్లు, సెంట్రల్ లైటింగ్లు మరియు అనేక రకమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని గుర్తు చేశారు. గత పాలకులు పెద్దపల్లి నియోజకవర్గాన్ని కూని చేసినప్పటికీ దళాశవరీగా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అభివృద్ధి చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు రుణమాఫీ, రైతు భరోసా, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళకు వడ్డీలేని రుణాలు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ మరియు అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో నిట్టూరు నుండి వెంకటరావుపల్లి మధ్యలో వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ & బి అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఇంపాక్ట్ ట్రైనర్ గా...డాక్టర్ దేవి లక్ష్మీనరసయ్య

**డిడి9వార్త /రామగుండం జూన్ 30:**

ప్రముఖ తెలంగాన ఉద్యమకారుడు..సామాజిక స్వచ్ఛంద సేవకులు. దళిత రత్న . లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు గ్రహీత . డాక్టర్ దేవి లక్ష్మి నరసయ్య. మరొక ప్రస్థానం... పెద్దపల్లి జిల్లా రాష్ట్ర స్థాయిలో . గత రెండు మూడు దశాబ్దాలుగా . సేవా కార్యక్రమాలు చేస్తూ. విద్యార్థులకు అనేక వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహిస్తూ . రక్తదాన శిబిరాలు.. పేద విద్యార్థులను. చదివిస్తూ పుస్తకాలు పంచుతూ ఉన్నారు.. ఇంపాక్ట్ సంస్థ ద్వారా . 30 రోజుల .ఆన్లైన్ శిక్షణ రెండు రోజుల ఆఫ్లైన్ .వర్క్ షాప్ శిక్షణ ముగించుకుని.. ఇంపాక్ట్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు. ముఖ్యఅతిథి. ప్రముఖ ట్రైనర్. బాల్యం అమూల్యం పుస్తక రచయిత . సుధీర్ సంద్ర . చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.. ఈ కార్యక్రమంలో ప్రముఖ ట్రైనర్లు. కే .రామచంద్రుడు.. శ్రీనివాస్ సోని పాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్. ఐసిఐ.. ఉదయ్ కుమార్.. తదితరులు పాల్గొన్నారు... ఈ శిక్షణ ముగించుకున్న తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో .కాలేజీల్లో. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాస శిక్షణ... సృజనాత్మకత.. లీడర్షిప్ డెవలప్మెంట్.. లక్ష్యసాధన.. గురువులు విద్యార్థుల మధ్య అవగాహన.. తల్లిదండ్రులు. గురువులు విద్యార్థులు.. మధ్య సద్భావన.. నెలకొల్పే విధంగా .శిక్షణ ఇచ్చి నవభారత నిర్మాణానికి రాళ్లు ఎత్తే కూలీలుగా తయారవ్వాలని .ఇంటికో స్పీకర్ . ఊరికి ఒక ట్రైనర్.. అనే ఇంపాక్ట్ నినాదంతో ఇంకా ముందుకెళ్తామని . ట్రైనర్ దేవి లక్ష్మి నరసయ్య అన్నారు



# క్రిటికల్ కేర్ భవనం - అత్యవసర వైద్యం కోసమా? లేక బిల్లుల కోసమా?

- **గోదావరిఖని ఏరియా ఆసుపత్రి దుస్థితిపై ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆగ్రహం.**

**డిడి9వార్త /రామగుండం జూన్ 30:**




గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కేవలం పేరుకే పెద్ద ఆసుపత్రి అన్నట్లు ఉందని, అఘమేఘాల మీద నిర్మించిన క్రిటికల్ కేర్ భవనం రోగుల సౌకర్యాల కోసమా లేక నిర్మాణంలో కమీషన్ల కోసమా అని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రిటికల్ కేర్ అంటే అత్యవసర వైద్యం కోసం అన్ని రకాల పరికరాలు, వైద్య బృందం, సిబ్బంది ఏర్పాటు చేయాల్సి ఉండగా కనీస సౌకర్యాలు లేక రోగులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. క్రిటికల్ కేర్‌లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్యం కోసం పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, తగిన సిబ్బందిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. టిహబ్ డయాగ్నస్టిక్స్ సెంటర్ ఇంత పెద్ద పారిశ్రామిక ప్రాంతం ఐన గోదావరిఖనిలో లేకపోవడం దురదృష్టకరమని, ప్రతిదానికీ పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని, వెంటనే ఏరియా ఆసుపత్రిలో టిహబ్ డయాగ్నస్టిక్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి కి నిజాయితీ గల సూపరింటెండెంట్ అనుభవం గల వ్యక్తిని ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డి.ఎం.ఇ గారు పునరాలోచించి నియమించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో కాంట్రాక్టర్ అరాచకాలు శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలను కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారని , కానీ సెక్యూరిటీలో పనిచేస్తున్న ఒక వ్యక్తి తానే కాంట్రాక్టర్ అన్నట్లుగా ప్రవర్తిస్తూ, తోటి సిబ్బందిని మానసికంగా వేధిస్తూ, ఉద్యోగాల నుండి తొలగిస్తూ రాక్షసానందం పొందుతున్నాడని ఆయన ఆరోపించారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై, సెక్యూరిటీ అరాచకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ స్కాన్ సెంటర్, ఆవరణలో ఆర్వో వాటర్ ప్లాంట్, ఏ.టి.ఎం సెంటర్ ఏర్పాటు చేయాలని, ఉచిత డెడ్ బాడీ వాహనాలు, నూతన ఫ్రీజర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే పాయం..

- **ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే.**

**మణుగూరు.జూన్ 29(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం లో సోమవారం నాడు పలు అభివృద్ధి పనులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్ లో సుమారు రూ.15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్, మరియు సి సి రోడ్డు నిర్మాణ పనులకు పూజా కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో స్థానిక ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుకూల వేదిక లభిస్తుందని, సిసి రోడ్డు నిర్మాణంతో రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారతాయని పేర్కొన్నారు.అనంతరం మణుగూరు మండలం లోని ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో రూ.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం సేవల నాణ్యత మరింత మెరుగుపడి మరిన్ని మెరుగైన వైద్య సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్,వైద్యులు,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మంత్రి గారు మరిచిపోయారా...

- ఇసుక దందాకు అడ్డుకట్ట వేయరేమి
- బీఆరెస్ యువజన నాయకుడు అలీమ్



**మహాదేవపూర్ జూన్ 29 ( డిడి 9 వార్త )**

తాత,ముత్తాతల నుండి వస్తున్న సహజ వనరులు ఇసుకను దోచుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇసుక మాఫియా కు అడ్డుకట్ట వేస్తానని ఎన్నికలకు ముందు ఎన్నో మాటలు చెప్పిన మంత్రి ఎమ్మెల్యే మంత్రి శ్రీధర్ బాబు నేడు ఇసుక మాఫియా కు వత్తాసు పలుకుతున్నాడని డిఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ఆలిం ఒక ప్రకటనలో తీవ్రంగా దుయ్యబట్టారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి కన్నేపల్లి పంప్ హౌస్‌కు ఇసుక మాఫియాతో ముప్పు ఉందని, ఇన్‌టేక్ ఛానల్, రిజర్వ్ ఫారెస్ట్ ల్లో ఇసుక కాంట్రాక్టర్లు విధ్వంసం సృష్టిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన కన్నేపల్లి పంప్ హౌస్ ఇన్‌టేక్ ఛానల్‌ను ఇసుక మాఫియా కబ్జా చేసి, ప్రభుత్వ ఆస్తిని నాశనం చేస్తోందన్నారు. కన్నేపల్లి వద్ద గోదావరి నది నుండి పంప్ హౌస్ లోని ఫోర్‌బే లోకి నీరు చేరే ఇన్‌టేక్ ఛానల్ రక్షణ కట్టల పైన రోజుకు వందల సంఖ్యలో ఇసుక లారీలు, టిప్పర్లు తిరుగుతున్నాయని, దీంతో కట్టలు బీటలు వారి, పూర్తిగా బలహీనపడే అవకాశం ఉందని,ఇన్‌టేక్ ఛానల్ దెబ్బ తింటే కాళేశ్వరం మొదటి లిఫ్ట్‌కే ముప్పు వాటిల్లుతుందని దీనితో మూడు టి ఎం సి ల నీటిని లిఫ్ట్ చేసే ప్రాజెక్టు మొత్తం నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అంతే కాకుండా కన్నేపల్లి పరిసరాల్లోని రిజర్వ్ ఫారెస్ట్ గుండా అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేస్తూ లారీలు నడుపుతున్నారని

దింతో పర్యావరణ విధ్వంసం అవుతుందన్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో వృక్ష సంపద నాశనం అవుతోందని, వన్యప్రాణుల ఆవాసాలకు తీవ్ర భంగం వాటిల్లుతోందన్నారు. కోట్లు ఖర్చుపెట్టి కట్టిన ప్రాజెక్టును ఇసుక మాఫియా నాశనం చేస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని

రాష్ట్రానికి సాగు, తాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఇసుక మాఫియా ఆగడాలను ఉక్కుపాదంతో అణచివేయాలని, ఇసుక కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వెంటనే కలెక్టర్, డి ఎఫ్ ఓ లు స్పందించి లారీల రాకపోకలను నిషేధించి, గుత్తేదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గిరిజన వికాసానికి ‘రాహుల్’ బాట..

- రెండేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు
- భద్రాచలం గిరిజన ప్రాంతంలో అభివృద్ధి విప్లవం
- ఐటీడీఏ పీవో రాహుల్ ప్రస్థానం స్ఫూర్తిదాయకం
- రెండేళ్ల పాలనలో సరికొత్త మైలురాళ్లు
- ప్రశంసలతో ముంచెత్తిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు
- అందరి సహకారంతోనే ఈ విజయం: పీవో బి. రాహుల్

**భద్రాచలం, జూన్ 29 (డిడి9 వార్త)**

ఒక అధికారి ప్రజాసేవను తన శ్వాసగా భావిస్తే ఆ ప్రాంతం ఎలా మారుతుందో చెప్పడానికి భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి (పీవో) బి. రాహుల్ ఒక ప్రత్యక్ష నిదర్శనమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కొనియాడారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీవో రాహుల్ రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ‘సక్సెస్ మీట్’లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ఆదర్శప్రాయుడు పీఓ బి రాహుల్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత రెండేళ్లలో రాహుల్ తన కార్యక్షేత్రంలో సృష్టించిన విప్లవాత్మక మార్పులు వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో నూతన ఆశలను చిగురింపజేశాయన్నారు. పరిపాలన అంటే కేవలం ఫైళ్లకు పరిమితం కాదని, అది అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సాధనమని ఆయన నిరూపించారని ప్రశంసించారు. విద్య, వైద్యం, వసతి, క్రీడలు, సంస్కృతి అనే ఐదు ప్రధాన సూత్రాలతో ఆయన నిర్మించిన ‘గిరిజన వికాస సౌధం’ దేశవ్యాప్త గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈ ప్రజా బాంధవుడి ప్రస్థానం భావి తరాలకు పాఠమని ఎమ్మెల్యే అభివర్ణించారు.

**అందరి కృషితోనే విజయం: పీవో రాహుల్**

ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ.. తన విజయం వెనుక జిల్లా ఎమ్మెల్యే, యూనిట్ అధికారులు, సిబ్బంది అందరి సహకారం ఉందని స్పష్టం చేశారు. ఐటీడీఏలో ప్రతి ఒక్కరూ గిరిజన అభివృద్ధిలో భాగస్వాములయ్యారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు చేపట్టిన ‘ఉద్దీపకం’ కార్యక్రమం 90 శాతం సత్ఫలితాలను ఇచ్చిందని వెల్లడించారు. భద్రగిరి మార్ట్ ద్వారా గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తూ వారి కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తున్నామని తెలిపారు. అలాగే, గిరిజన మ్యూజియం ఆధునీకరణ ద్వారా రాష్ట్ర గ్రామీణ పర్యాటక పురస్కారం దక్కడం, 1.5 లక్షల మంది సందర్శకులను ఆకర్షించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.







**పోస్టర్ ఆవిష్కరణ.. సంబరాలు**

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సాధించిన ప్రగతిని వివరించే పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పీవో రాహుల్‌కు ఎమ్మెల్యే కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, భద్రాచలం సర్పంచ్ పూణేమ్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సూర్యనారాయణ

- సూర్యనారాయణ సేవలు అభినందనీయం
- ములుగు డిఈఓ ఎ. సిద్ధార్థ రెడ్డి

జడ్పీహెచ్ఎస్ దేవగిరి పట్నం పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగవరపు శ్రీధర్ అధ్యక్షతన ఇనుగాల సూర్యనారాయణ పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ములుగు ఏ సిద్ధార్థ రెడ్డి, హాజరై పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆదర్శ ఉపాధ్యాయులుగా సేవలందించి ఉన్నతమైన పదవులను అలంకరించి జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ములుగు కార్యదర్శిగా వారి సేవలు చిరస్మరణీయం, గత పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలోనే మొదటి స్థానం రావడానికి కృషిచేసిన అధికారులలో సూర్యనారాయణ సారు ఒకరు అని ఈ కార్యక్రమంలో చెప్పడం జరిగింది, పదవి విరమణ అనంతరం కూడా మీ యొక్క సేవలు సలహాలు సూచనలు అవసరం ఉంటాయని ప్రగాఢంగా విశ్వసిస్తున్నానని విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

అలాగే డిఎన్ఆర్ విద్యా సేవా సంస్థ అధినేత దొడ్డ ప్రతాపరెడ్డి వన మహోత్సవ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ప్రారంభించి మొక్కలు నాటడం జరిగింది. డిఎన్ఆర్ ట్రస్టు వారి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలో ఉన్న ప్రతి పాఠశాల వన మహోత్సవ కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి సార్ మాట్లాడుతూ నా యొక్క మిత్రుడైన ఇనుగాల సూర్యనారాయణ పదవి విరమణ సందర్భంగా ఆ దైవం కల్పించిన అవకాశం గా భావిస్తూ వారి జ్ఞాపకంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం నా అదృష్టం

హాజరైన మండల విద్యాశాఖ అధికారులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సన్మాన గ్రహీత అయిన ఇనుగాల సూర్యనారాయణ లక్ష్మి దంపతులను ఉద్దేశించి 40 సంవత్సరాల సుదీర్ఘ కాల ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, మానవతా విలువలు ఉన్న మంచి మహోన్నతమైన మనిషి ఈరోజు పదవి విరమణ పొందుతున్నాడు అంటే చాలా బాధగా ఉన్నది అని అంటూనే వారిని ఘనంగా సన్మానించుకొని పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూలమ్మ దేవగిరిపట్నం గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్ రాజు, దేవగిరిపట్నం పాఠశాల ఉపాధ్యాయ బృందం,జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ములుగు మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, దేవగిరి పట్టణ గ్రామ ప్రజలు మరియు విద్యార్థులు పాల్గొని ఈ పదవి విరమణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించటం జరిగింది.



## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

- మధిర అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్ శ్రీనివాస్

**బోనకల్, జూన్ 29,(డీడీ9 వార్త):**



ఓటరు జాబితా వివరాలను సమగ్రంగా పరిశీలించాలని మధిర అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి,ఖమ్మం రెవిన్యూ డివిజన్ అధికారి ఎన్ శ్రీనివాస్ ఆదేశించారు. మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామం నందు క్షేత్రస్థాయి తనిఖీలో భాగంగా 106,107&108 తదితర పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు, సోమవారం సాయంత్రంకి ఇంటింటి ఓటర్ సర్వే పారాలను అందజేయాలని ఆదేశించారు,తిరిగి తీసుకునేటప్పుడు వారి నుండి ఒక కలర్ ఫోటో సంతకాలతో సహా 1987 కంటే ముందు 1.7.1987 నుండ2.12 2004 వరకు 2004 తర్వాత మూడు సంబంధిన సంబంధిత ఎన్నికల సంఘం వారు నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను ఏదో ఒకటి అందజేయాలని తెలియజేశారు,అలాగే రాజకీయ పార్టీల బి ఎల్ ఏ లు తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు మణుగూరు పట్టణ బంద్..

- సేవ్ మణుగూరు పేరిట అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో బంద్ నిర్వహణ..
- సంపూర్ణ మద్దతు తెలిపిన వ్యాపార వర్గాలు, విద్యా సంస్థలు.

**మణుగూరు.జూన్ 29 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి. 1974 వ సంవత్సరంలో మణుగూరులో సింగరేణి బొగ్గుబావి PK 1ఇంక్లైన్ ను ప్రారంభించి PK 1, PK 2,PK 3, ఓపెన్ కాస్ట్, OC 2, OC4. ఇలా బొగ్గు నిక్షేపాలను తీస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి దోహదం చేశాయి. బొగ్గు నిక్షేపాలు దగ్గరగా ఉండడంతో BTPS కర్మాగారం నిర్మాణం కూడా చేపట్టడం జరిగింది.మణుగూరులో ఇంకా 25 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు నిక్షేపంగా ఉన్నాయని అధికారులు, నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మణుగూరులో OC 2 డీప్ సైడ్ బ్లాకును ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారు.మణుగూరు OC ప్రాజెక్ట్ కు 2027 నవంబర్ వరకే పర్మిషన్ ఉంది. ఇదే జరిగితే ఇక్కడ ఉన్న కార్మికులను ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. ఇదే జరిగితే మణుగూరు భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. కాబట్టి మణుగూరు OC2 డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణి కే అప్పగించాలని,మణుగూరు ఓపెన్ కాస్ట్ విస్తరణకు అనుమతులను తీసుకు రావాలని డిమాండ్ చేస్తూ ది 30 06 2026 (మంగళవారం) మణుగూరు పట్టణ బంధును అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు తలపెట్టాయి.మణుగూరు ప్రాంత ప్రజలు,వర్తక,వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, వాణిజ్య పట్టణ ప్రముఖులు,స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, మరియు ప్రజాస్వామ్య వాదులు అందరూ బాధ్యతగా స్పందించి మన మణుగూరు భవిష్యత్తును, ఇక్కడి ఉపాధి అవకాశాలను కాపాడుకోవడానికి ఈ మణుగూరు పట్టణ బంద్ కు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల పక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. మణుగూరు OC2 డిప్ సైడ్ బ్లాక్ ను ప్రైవేటీకరించకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలి,మణుగూరు OC విస్తరణకు అనుమతులను తక్షణమే మంజూరు చేయాలి, స్థానిక కార్మికుల ఉపాధిని,మణుగూరు ఆర్థిక వ్యవస్థ ను కాపాడాలి. అనే ప్రధాన డిమాండ్ లతో జరగబోయే పట్టణ బంధు కు సహకరించాలని కోరుతూ సోమవారం నాడు పట్టణంలోని వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, పట్టణ ప్రముఖులకు అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు.

## భవితా బిల్డింగ్ ప్రారంభించిన గ్రామ సర్పంచ్ పీఎన్ఆర్

- ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం

**బోనకల్,జూన్ 29,(డీడీ9 వార్త):**

మండల పరిధిలోని ముష్టికుంట్ల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో భవిత బిల్డింగ్ ను గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ (నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ) తరగతులను విజయవంతంగా ప్రారంభించిందని 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈ ప్రీప్రైమరీ తరగతులు అందుబాటులో ఉంటాయనీ ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య,ఎసిడీపీఓ షకీరా,సహకారసంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు,ఐఈఆర్పీ పుల్లారాణి, ఫిజియోథెరపిస్ట్ అమృతవర్షిణి,స్పెషల్ ఎడ్యుకేటర్ ప్రశాంతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత కుమారి,విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఆశ్రమ హై స్కూల్ కోడిశాల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఎంపీడీఓ తేజ

**తాడ్వాయి మండలం జూన్ 29 (డిడి9 వార్త)**

తాడ్వాయి మండలంలోని ఆశ్రమ హై స్కూల్ కోడిశాల పాఠశాలను ఎంపీడీఓ శ్రీ తేజ ఈరోజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, డార్మెంటు, పాఠశాల ఆవరణం, వంటశాల పరిసరాలను పరిశీలించారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు తరగతి గదులు, వసతి గృహం, పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ తోలెం దేవదాస్ లింగాల సర్పంచ్ శ్రీ మొగిల్లిపల్లి రవీందర్ డిప్యూటీ వార్డెన్ శ్రీ చేల కృష్ణ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- పీహెచ్‌సీల్లో గర్భిణీలకు మెరుగైన వైద్యం అందించాలి
- నార్మల్ డెలివరీల శాతం పెరగాలి: ఐటీడీఏ పీవో బి. రాహుల్

**భద్రాచలం, జూన్ 29 (డిడి9 వార్త)**

మారుమూల ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పీహెచ్‌సీల పనితీరు, గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో క్యాన్సర్, టీబీ రోగుల డేటాను వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గర్భిణీలు డెలివరీకి సిద్ధంగా ఉన్నప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, పీహెచ్‌సీల్లో నార్మల్ డెలివరీలు జరిగేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్వైజర్లు తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

**ముంపు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు:**

వరద ముంపునకు గురయ్యే గ్రామాల్లోని గర్భిణీలను నెల రోజుల ముందుగానే బర్త్ వెయిటింగ్ హాల్‌లకు తరలించి, సురక్షిత ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఆయుష్మాన్ భవ శిబిరాలను నిర్వహించి, రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి భద్రాచలం ఎన్ఆర్సీకి తరలించాలన్నారు. 108, 102 వాహనాలను గర్భిణీల కోసం అత్యవసర సేవల్లో వినియోగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్ట్ అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, డీసీహెచ్ఎస్ రవిబాబు, ఏడీఎంహెచ్‌వో సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శరత్, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.